

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 09-07-2025 | సంపుటి - 24 | సంచిక - 66 | రూ : 4 | పేజీలు: 8




## ఆధార్ కేంద్రం అడ్రస్ చెప్పే 'భువన్ ఆధార్' పోర్టల్

- సమీపంలోని కేంద్రాలను సులభంగా గుర్తించే సౌకర్యం
- యూఐడీఏఐ, ఇస్రో సంయుక్త భాగస్వామ్యం
- కేంద్రానికి వెళ్లేందుకు రూట్ మ్యాప్ సదుపాయం
- అవసరమైన సేవలను ఫిల్టర్ చేసుకునే వీలు

ఆధార్ కార్డులో వివరాలు మార్చుకోవాలన్నా, కొత్తగా నమోదు చేసుకోవాలన్నా సమీపంలోని ఆధార్ సేవా కేంద్రానికి వెళ్లడం తప్పనిసరి. అయితే నగరాల్లో ఈ కేంద్రాలు ఎక్కడున్నాయో తెలుసుకోవడం కాస్త

తరువాయి 2లో

## నవోదయలో 6వ తరగతి ప్రవేశాలు.. దరఖాస్తులకు జూలై 29 చివరి తేదీ!

- నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ
- 2026-27 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్‌లో జూలై 29 వరకు అవకాశం
- తెలుగు రాష్ట్రాల్లో 2025 డిసెంబర్ 13న జరగనున్న ప్రవేశ పరీక్ష
- గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు 75 శాతం సీట్లు రిజర్వ్
- ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు పూర్తి ఉచితంగా విద్య, వసతి

దేశవ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఆసక్తిగల విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్

తరువాయి 2లో






## యూరియా.. కోటా పెంచండి

- కేంద్ర మంత్రి నడ్డాకు సీఎం వినతి
- జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీ అభివృద్ధికి చేయూతనివ్వాలని పీయూష్ గోయల్‌కు విజ్ఞప్తి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన దిల్లీ పర్యటనలో రెండో రోజు మంగళవారం ఇద్దరు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. రాష్ట్రానికి యూరియా కోటా పెంచాలని ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాకు విజ్ఞప్తి చేశారు. కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను

తరువాయి 2లో

## విశాఖకు మరో భారీ ఐటీ సంస్థ.. 10 వేల ఉద్యోగాలతో ఏఎన్‌ఎస్‌ఆర్ క్యాంపస్




- విశాఖలో ఏఎన్‌ఎస్‌ఆర్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు
- ఏపీ ప్రభుత్వంతో కీలక అవగాహన ఒప్పందం
- మధురవాడ ఐటీ క్లస్టర్‌లో అత్యాధునిక క్యాంపస్ నిర్మాణం
- రాబోయే ఐదేళ్లలో 10,000 మందికిపైగా ఉద్యోగాలు
- విశాఖను జీసీసీ రాజధానిగా మారుస్తామన్న మంత్రి లోకేశ్
- రాష్ట్రానికి టాప్-100 ఐటీ కంపెనీలను రప్పిస్తామని వెల్లడి

ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చాలన్న ప్రభుత్వ లక్ష్యంలో మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల అభివృద్ధికి ఊతమిస్తూ, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటులో ప్రపంచ ప్రఖ్యాతి పొందిన ఏఎన్‌ఎస్‌ఆర్ (ఏఎన్‌ఎస్‌ఆర్) సంస్థ విశాఖపట్నంలో భారీ క్యాంపస్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. మధురవాడ ఐటీ క్లస్టర్‌లో అత్యాధునిక జీసీసీ ఇన్నోవేషన్ క్యాంపస్‌ను స్థాపించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒక అవగాహన ఒప్పందం

తరువాయి 2లో



## అహ్మదాబాద్ విమాన ప్రమాదం.. ప్రభుత్వానికి చేరిన కీలక నివేదిక..

- 241 మంది మృతికి కారణాలపై కొనసాగుతున్న దర్యాప్తు
- విమానం బ్లాక్ బాక్స్‌ల డేటాను విశ్లేషిస్తున్న అధికారులు
- రెండు ఇంజిన్లు ఒకేసారి ఆగిపోవడంపై ప్రధానంగా దృష్టి
- ఈ వారంలోనే నివేదికను ప్రజలకు విడుదల చేసే అవకాశం

దేశవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై

తరువాయి 2లో

## శ్రీశైలం వద్ద కృష్ణమ్మకు జలహారతి ఇచ్చిన సీఎం చంద్రబాబు



- శ్రీశైలంలో సీఎం చంద్రబాబు పర్యటన
- జులై తొలివారంలోనే నిండిన జలాశయం
- 4 గేట్లు ఎత్తి కృష్ణమ్మకు జలహారతి
- రాయలసీమను రతనాల సీమగా మార్చడమే లక్ష్యం
- జీడిపల్లి, కుప్పానికి నీటి విడుదలకు గడువు నిర్దేశం
- గత ప్రభుత్వం సీమను పట్టించుకోలేదని విమర్శ

నేడు శ్రీశైలంలో పర్యటించిన ఏపీ సీఎం చంద్రబాబు, కృష్ణమ్మకు జలహారతి సమర్పించి, ప్రాజెక్టు నాలుగు గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో రాయలసీమ అభివృద్ధికి తన ప్రభుత్వ ప్రాధాన్యతలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కూడా పాల్గొన్నారు.

### రాయలసీమకు జలకళ

ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయడానికి ముందు శ్రీశైల మల్లన్నకు ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తరువాయి 2లో

# శ్రీశైలం వద్ద కృష్ణమ్మకు జలహారతి ఇచ్చిన సీఎం చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

రాయలసీమను రతనాల సీమగా మార్చాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. మల్లన్న ఆశీస్సులతో ఈ ప్రాంతం సుభిక్షంగా వర్ధిల్లుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. "నా జీవితంలో ఇది అత్యంత సంతోషకరమైన రోజు. జులై మొదటి వారంలోనే శ్రీశైలం జలాశయం నిండుకుండలా మారడం శుభపరిణామం. జలాలే మన నిజమైన సంపద, సాగునీటి ప్రాజెక్టులే ఆధునిక దేవాలయాలు. వాటితోనే రైతుల కష్టాలు తీరతాయి. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 200 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది" అని చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. గతంలో రాయలసీమను ఎవరూ కాపాడలేరని చాలామంది అన్నారని, కానీ స్వర్గీయ ఎన్టీఆర్ ఆ పరిస్థితిని మార్చేందుకు నడుం బిగించారని గుర్తుచేశారు.

**సాగునీటిపై నిర్దిష్ట లక్ష్యాలు**

రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చంద్రబాబు స్పష్టం చేశారు. జీడిపల్లికి నీటిని తీసుకెళ్లే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని హామీ ఇచ్చారు. ఈ నెల 15వ తేదీ నాటికి ఆ ప్రాంతానికి నీరు అందించాలని అధికారులకు లక్ష్యం నిర్దేశించినట్లు వెల్లడించారు. అలాగే, జులై 30 నాటికి కుప్పం, మదనపల్లెకు సాగునీరు చేరాలని ఆదేశించినట్లు తెలిపారు. పోతిరెడ్డిపాడు, గాలేరునగరి, గండికోట వంటి ప్రాజెక్టులను తామే తీసుకువచ్చామని చెప్పారు.

**అభివృద్ధిపై బ్లూప్రింట్ సిద్ధం**

గత వైసీపీ ప్రభుత్వం రాయలసీమను పూర్తిగా విస్మరించిందని చంద్రబాబు ఆరోపించారు. తమ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.68 వేల కోట్లు ఖర్చు చేసిందని అన్నారు. రాయలసీమ సమగ్రాభివృద్ధికి తన వద్ద స్పష్టమైన బ్లూప్రింట్ ఉందని, పోలవరం వల్లే సీమకు నీళ్లు వస్తున్నాయని పేర్కొన్నారు. కొప్పర్తి, ఓర్వకల్లు ప్రాంతాలను పారిశ్రామిక హబ్‌లుగా తీర్చిదిద్దుతామని, దేశంలోనే అత్యుత్తమ రోడ్ల వ్యవస్థను ఈ ప్రాంతంలో నిర్మించామని తెలిపారు. తెలుగుజాతి ప్రపంచంలోనే నంబర్ వన్‌గా నిలవాలన్నదే తన లక్ష్యమని పునరుద్ఘాటించారు.

# నవోదయలో 6వ తరగతి ప్రవేశాలు.. దరఖాస్తులకు జూలై 29 చివరి తేదీ!

(మొదటిపేజీ తరువాయి)

ద్వారా జూలై 29వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని నవోదయ విద్యాలయ సమితి సూచించింది. నవోదయ పాఠశాలల్లో సీటు సాధిస్తే ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్య, వసతి పూర్తిగా ఉచితంగా లభిస్తాయి. దేశవ్యాప్తంగా మొత్తం 654 నవోదయ విద్యాలయాలు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో 15, తెలంగాణలో 9 ఉన్నాయి. ఈ సీట్ల భర్తీ కోసం రెండు దశల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో 2025 డిసెంబర్ 13న పరీక్ష జరగనుంది. కొన్ని పర్వత ప్రాంత రాష్ట్రాల్లో మాత్రం 2026 ఏప్రిల్ 11న నిర్వహిస్తారు. విద్యార్థులు తాము ప్రవేశం కోరుకుంటున్న జిల్లాలోనే 5వ తరగతి చదువుతూ ఉండాలి. మొత్తం సీట్లలో 75 శాతం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కేటాయించారు. గ్రామీణ కోటా కోసం విద్యార్థులు 3, 4, 5 తరగతులను తప్పనిసరిగా గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన పాఠశాలలో పూర్తిచేయాలి. బాలికల కోసం మూడో వంతు సీట్లు రిజర్వ్ చేశారు. వీటితో పాటు ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి. ప్రవేశ పరీక్షను 100 మార్కులకు 80 ఆబ్జెక్టివ్ ప్రశ్నలతో రెండు గంటల పాటు నిర్వహిస్తారు. పరీక్షలో నెగెటివ్ మార్కులు లేవు. ఇక్కడ చదివే విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, ఇతర నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తూ, జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు కూడా సిద్ధం చేస్తారు. ఒక్కో నవోదయ పాఠశాలలో గరిష్ఠంగా 80 మంది విద్యార్థులకు ఆరో తరగతిలో ప్రవేశం లభిస్తుంది. బాలబాలికలకు విడిగా వసతి కల్పిస్తారు.

# ఆధార్ కేంద్రం అడ్రస్ చెప్పే 'భువన్ ఆధార్' పోర్టల్

(మొదటిపేజీ తరువాయి)

ఇబ్బందికరమే. ఈ సమస్యకు పరిష్కారంగా భారత విశిష్ట ప్రాధికార సంస్థ, ఇస్రోకు చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌తో కలిసి 'భువన్ ఆధార్' అనే ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ పోర్టల్ ద్వారా ఆధార్ కార్డుదారులు తమకు దగ్గరలో ఉన్న కేంద్రాలను అత్యంత సులభంగా గుర్తించవచ్చు. కేంద్రం చిరునామాతో పాటూ అక్కడికి చేరుకోవడానికి అవసరమైన రూట్ మ్యాప్‌ను కూడా ఈ పోర్టల్ అందిస్తుంది. వినియోగదారుల సౌకర్యార్థం ఇందులో నాలుగు రకాల సెర్చ్ ఆప్షన్లు ఉన్నాయి. 'సెంటర్స్ నియర్‌బై' ఆప్షన్‌తో సమీప కేంద్రాలను, 'సెర్చ్ బై పిన్‌కోడ్' ద్వారా నిర్దిష్ట ప్రాంతంలోని కేంద్రాలను తెలుసుకోవచ్చు. అంతేకాకుండా, రాష్ట్రం, జిల్లా, మండలం వంటి వివరాలను ఎంచుకుని కూడా కేంద్రాల జాబితాను పొందవచ్చు. వినియోగదారులు తాము పొందాలనుకుంటున్న సేవలు ఆయా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయో లేదో కూడా ముందుగానే ఫిల్టర్ చేసి చూసుకునే సౌకర్యం కల్పించారు. దీనివల్ల ప్రజల సమయం ఆదా అవ్వడంతో పాటు, ఆధార్ సంబంధిత సేవలు మరింత వేగంగా, సౌకర్యవంతంగా పొందేందుకు వీలు కలుగుతుంది.

# ఎర్ర సముద్రంలో లేజర్ దాడి... చైనాపై జర్మనీ ఆరోపణలు

ఎర్ర సముద్రంలో కొత్త ఉద్రిక్తతలు మొదలయ్యాయి. తమ నిఘా విమానాన్ని చైనాకు చెందిన యుద్ధనౌక లేజర్‌తో లక్ష్యంగా చేసుకుందని జర్మనీ సంచలన ఆరోపణలు చేసింది. ఈ ఘటనపై తీవ్ర నిరసన వ్యక్తం చేసిన జర్మనీ, తమ దేశంలోని చైనా రాయబారిని పిలిపించి వివరణ కోరింది. ఈ చర్య ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది. జర్మనీ రక్షణ మంత్రిత్వ శాఖ కథనం ప్రకారం, ఈ నెల ప్రారంభంలో ఈ ఘటన జరిగింది. హూతీ తిరుగుబాటుదారుల దాడుల నుంచి వాణిజ్య నౌకలను కాపాడేందుకు యూరోపియన్ యూనియన్ (ఈయూ) నిర్వహిస్తున్న 'ఆస్పైడ్స్' మిషన్‌లో భాగంగా జర్మనీ విమానం గస్తీ కాస్తోంది. ఈ సమయంలో చైనా యుద్ధనౌక ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా తమ విమానంపైకి లేజర్‌ను ప్రయోగించింది. దీంతో అప్రమత్తమైన పైలట్లు, ముందు జాగ్రత్త చర్యగా మిషన్‌ను అర్థాంతరంగా నిలిపివేసి జిబౌటీలోని స్థావరానికి విమానాన్ని సురక్షితంగా తీసుకువచ్చారు. ఈ ఘటనలో విమాన సిబ్బందికి ఎలాంటి హాని జరగలేదని అధికారులు తెలిపారు. "చైనా చర్య సిబ్బంది భద్రతకు, మిషన్ కార్యకలాపాలకు ప్రమాదం కలిగించేలా ఉంది. లేజర్‌ను ఉపయోగించడం ద్వారా, చైనా యుద్ధనౌక మా సిబ్బందికి, విమానానికి ప్రమాదం తలపెట్టేందుకే సిద్ధపడింది" అని జర్మనీ రక్షణ శాఖ ప్రతినిధి ఒకరు వ్యాఖ్యానించారు. ఆస్పైడ్స్ మిషన్ కేవలం వాణిజ్య నౌకల రక్షణకు మాత్రమే పరిమితమని, సైనిక దాడుల్లో పాల్గొనదని ఈయూ స్పష్టం చేస్తోంది. మరోవైపు, జర్మనీ చేసిన తీవ్ర ఆరోపణలపై చైనా ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. హూతీల దాడులతో ఇప్పటికే అట్టుడుకుతున్న ఎర్ర సముద్రంలో ఈ తాజా పరిణామం అంతర్జాతీయంగా ఆందోళన కలిగిస్తోంది.

# అహ్మదాబాద్ విమాన ప్రమాదం.. ప్రభుత్వానికి చేరిన కీలక నివేదిక..

దర్యాప్తులో కీలక ముందడుగు పడింది. ఈ ఘోర దుర్ఘటనకు సంబంధించిన ప్రాథమిక నివేదికను ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (AAIB) పౌర విమానయాన మంత్రిత్వ శాఖకు సమర్పించింది. గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ సహా 241 మందిని బలిగొన్న ఈ ప్రమాదంపై దర్యాప్తు బృందం తన ప్రాథమిక అంచనాలను ఈ నివేదికలో పొందుపరిచింది. గత నెల జూన్ 12న అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయలుదేరిన ఈ విమానం, టేకాఫ్ అయిన కేవలం 32 సెకన్లకే కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమానంలోని ఇద్దరు పైలట్లు, 10 మంది సిబ్బంది, ప్రయాణికులు సహా 241 మంది సజీవ దహనమయ్యారు. అదృష్టవశాత్తు సీటు నంబర్ 11ఏలో కూర్చున్న ఒక్క ప్రయాణికుడు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డాడు. ప్రమాదానికి గల కారణాలను ఛేదించేందుకు అధికారులు ముమ్మర దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రమాద స్థలంలో లభ్యమైన కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ (సీవీఆర్), ఫ్లైట్ డేటా రికార్డర్ (ఎఫ్‌డీఆర్)లను విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా విమానం టేకాఫ్ అయ్యే కీలక సమయంలో పైలట్లు ప్రమాదవశాత్తు ఫ్యూయల్ స్విచ్‌లను ఆఫ్ చేశారా? అనే కోణంలో దర్యాప్తు బృందాలు దృష్టి సారించాయి. బ్లాక్ బాక్స్‌ల డేటాను, విమాన శకలాల్లో లభించిన ఫ్యూయల్ స్విచ్‌ల భాగాలను పోల్చి చూస్తున్నారు. అదే సమయంలో రెండు ఇంజిన్లు ఒకేసారి ఫెయిల్ అయ్యాయా? అనే కోణంలో కూడా విచారణ జరుగుతోంది. విమానం 400 అడుగుల కంటే తక్కువ ఎత్తులో ఉన్నప్పుడు రెండు ఇంజిన్లు ఆగిపోతే ఎలా స్పందించాలనే దానిపై పైలట్లకు శిక్షణ ఉండదని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో దర్యాప్తు అధికారులు సమర్పించిన నివేదిక కీలకంగా మారింది. ఈ వారంలోనే ఈ నివేదికను ప్రజలకు విడుదల చేయనున్నట్లు, దాని ద్వారా ప్రమాద కారణాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ ఉన్నతాధికారులు తెలిపారు.

# విశాఖకు మరో భారీ ఐటీ సంస్థ.. 10 వేల ఉద్యోగాలతో ఏఎన్ఎస్ఆర్ క్యాంపస్

(ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా రానున్న ఐదేళ్లలో 10,000 మందికి పైగా నాణ్యమైన ఉద్యోగాలు లభించనున్నాయి. మంగళవారం రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు జరిగాయి. ఈ సందర్భంగా ఏఎన్ఎస్ఆర్ సంస్థ సీఈఓ లలిత్ అహూజా మాట్లాడుతూ, "ప్రపంచ స్థాయి ప్రతిభ, బలమైన మౌలిక సదుపాయాలు, దార్శనిక నాయకత్వం వంటివి విశాఖలో మేళవించి ఉన్నాయి. ఇవి అద్భుతాలు సృష్టించేందుకు దోహదపడతాయి. మా ఇన్నోవేషన్ క్యాంపస్ ప్రపంచంలోని ప్రతిష్ఠాత్మక సంస్థలకు విశాఖను ఒక ప్రధాన గమ్యస్థానంగా మారుస్తుంది" అని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతిభావంతులను ప్రపంచ స్థాయి కంపెనీలతో అనుసంధానించడంలో తమ సంస్థ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు.




*** విశాఖను జీసీసీ రాజధానిగా మారుస్తాం: మంత్రి లోకేశ్**

ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, రాష్ట్ర యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. "రాబోయే నాలుగేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఉద్యోగాలు సృష్టించాలన్నది మా లక్ష్యం. ఇందులో కేవలం ఐటీ, జీసీసీ రంగాల్లోనే 5 లక్షల ఉద్యోగాలు కల్పించబోతున్నాం. ఈ ఉద్యమాన్ని విశాఖ నుంచే ప్రారంభించాం" అని అన్నారు. వ్యాపారానికి అనుకూలమైన బెంగళూరు, ఆహ్లాదకరమైన జీవనశైలికి ప్రసిద్ధి చెందిన గోవా నగరాల మేలు కలయికగా విశాఖను తీర్చిదిద్దాలన్నది తమ విధానమని లోకేశ్ వివరించారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధి వ్యూహంలో జీసీసీల పాత్ర అత్యంత కీలకమని, అందుకే వాటిని వ్యూహాత్మక హబ్‌లుగా మార్చేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. "ఇప్పటికే టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి దిగ్గజ సంస్థలకు ఎకరా 99 పైసలకే భూములు కేటాయించాం. దీని ద్వారా మా 5 లక్షల ఉద్యోగాల లక్ష్యంలో ఇప్పటికే 12 శాతం నెరవేరింది. త్వరలోనే దేశంలోని టాప్ 100 ఐటీ కంపెనీలను ఏపీకి రప్పించాలన్నదే మా సంకల్పం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అమెరికా వెలుపల గూగుల్ సంస్థ తన అతిపెద్ద డేటా సెంటర్‌ను విశాఖలో నిర్మిస్తోందని, దేశంలోనే అతిపెద్ద డేటా సిటీని కూడా ఇక్కడ అభివృద్ధి చేస్తున్నామని గుర్తుచేశారు. కేవలం ప్రోత్సాహకాలే కాకుండా, జీసీసీల అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలను మార్చి, క్లౌడ్, ఏఐ, సైబర్ సెక్యూరిటీ వంటి కోర్సుల్లో నైపుణ్యాలను పెంచేందుకు పలు కంపెనీలతో కలిసి పనిచేస్తున్నామని లోకేశ్ వెల్లడించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంతో విశాఖకు ప్రపంచ స్థాయి కనెక్టివిటీ పెరుగుతుందని, ఈ నగరాన్ని ప్రపంచ జీసీసీ నూతన రాజధానిగా మార్చేందుకు చేస్తున్న తమ కృషిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌కు సవాల్ విసిరితే.. బీఆర్ఎస్ నేతలు అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారు

- **మహబూబాబాద్‌లో రూ.295 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**
- **అసెంబ్లీకి రమ్మంటే ప్రెస్ క్లబ్‌కు వెళ్తున్నారు: భట్టి విమర్శ**
- **ఆ అహంకారం వల్లే లోక్‌సభలో బీఆర్ఎస్‌కు సున్నా**
- **లక్ష కోట్లతో బీఆర్ఎస్ పాలకుల విఫల యత్నంపై ఫైర్**



ప్రజా సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసిరితే, బీఆర్ఎస్ నేతలు మాత్రం ప్రెస్ క్లబ్‌లకు వెళ్లి అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రంగా విమర్శించారు. బీఆర్ఎస్ నేతల అహంకారపూరిత వైఖరి వల్లే ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా దక్కలేదని, ఇదే తీరు కొనసాగితే భవిష్యత్తులోనూ అదే ఫలితం పునరావృతం కావడం ఖాయమని ఆయన హెచ్చరించారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు కేసముద్రంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, సీతక్క తదితరులతో కలిసి భట్టి విక్రమార్క రూ.294.78 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, కేవలం 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని, మూడు నెలల్లో రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామని గుర్తుచేశారు. పంటకు రూ.500 బోనస్ ఇవ్వడం అన్యాయం ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై భట్టి విమర్శలు గుప్పించారు. "రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి కనీసం పది వేల ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేని వారు మాపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉంది" అని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా రాజీపడదని, నీటి వాటాలపై ఎప్పుడైనా చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. ఇదే సభల్లో మాట్లాడిన ఇతర మంత్రులు, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే బీఆర్ఎస్ నేతలు ప్రజలపై ప్రేమ ఉన్నట్లు నటిస్తున్నారని ఆరోపించారు.

# యూరియా కోటా పెంచండి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన ఢిల్లీ పర్యటనలో రెండో రోజు మంగళవారం ఇద్దరు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. రాష్ట్రానికి యూరియా కోటా పెంచాలని ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాకు విజ్ఞప్తి చేశారు. కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను కలిసి జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీ, వరంగల్ విమానాశ్రయానికి ఆర్థిక సాయం, హైదరాబాద్‌విజయవాడల మధ్య నూతన పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, హైదరాబాద్ బెంగళూరు మధ్య తలపెట్టిన పారిశ్రామిక కారిడార్‌ను ఏరోడిఫెన్స్ కారిడార్‌గా అభివృద్ధి చేయడంపై చర్చించారు. రాష్ట్రంలో ఎరువుల కొరత కారణంగా రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ఆ సమస్య గురించి జేపీ నడ్డాకు ముఖ్యమంత్రి వివరించారు. "ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి ఏప్రిల్‌జూన్ నెలల మధ్య 5 లక్షల టన్నులు సరఫరా చేయాల్సి ఉండగా 3.07 లక్షల టన్నులు మాత్రమే సరఫరా చేశారు. రాష్ట్రంలో వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ సమయంలో యూరియా అవసరం ఉన్నందువల్ల నిరాటంకంగా సరఫరా చేయాలి. జులై నెలకు సంబంధించి దేశీయంగా ఉత్పత్తి అయిన యూరియా 63 వేల టన్నులు, విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న దాంట్లో 97 వేల టన్నులు సరఫరా చేయాల్సి ఉండగా.. ఇప్పటివరకు 29 వేల టన్నులు మాత్రమే అందించారు. రాష్ట్ర రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని దేశీయంగా ఉత్పత్తి అయ్యే యూరియా కోటా పెంచాలి. యూరియా సరఫరాకు తగ్గట్టు రైల్ రేక్‌లను పెంచాలి" అని కేంద్ర మంత్రికి రేవంత్‌రెడ్డి విన్నవించారు.

# సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలి

* **కొత్తగూడెం 3టౌన్ పోలీస్ స్టేషన్ ను సందర్శించిన జిల్లా ఎస్పీ**





ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మంగళవారం కొత్తగూడెం 3టౌన్ పోలీస్ స్టేషన్ ను సందర్శించారు.ముందుగా కొత్తగూడెం డిఎస్పి రెహమాన్పుష్పగుచ్ఛం అందించి జిల్లా ఎస్పీ కి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తించే సిబ్బంది నుండి గౌరవ వందనాన్ని స్వీకరించారు. కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తించే సిబ్బంది యొక్క ప్రభుత్వ కిట్ ఆర్టికల్స్ ను ఎస్పీ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.పోలీస్ స్టేషన్లో వర్టికల్స్ వారీగా విధులు నిర్వర్తించే సిబ్బందిని ఒక్కొక్కరిగా వారి పనితీరు గురించి పరిశీలించారు.పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడ కుండా నిత్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలకు అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో సంచరిస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.డయల్ 100 కు ఫోన్ రాగానే సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలవాలని సూచించారు.పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు,సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో వన మహోత్సవం లో భాగంగా జిల్లా ఎస్పీ తో పాటు అధికారులు, సిబ్బంది మొక్కలను నాటారు. కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, సీఐ శివ ప్రసాద్, ఎస్సైలు పురుషోత్తం, విజయ కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలలకు దేశ ప్రముఖుల పటాలు అందజేత



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మండలంలో గల సకల ప్రభుత్వ పాఠశాలలకు దేశ ప్రముఖులతో కూడిన పటాన్ని కొత్తగూడెం మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ప్రభుదయాల్ మంగళవారం అందజేశారు. చదువుతోపాటు దేశ ప్రముఖులు చేసిన సేవలను వారి ఉన్నత వ్యక్తిత్వాన్ని విద్యార్థులకు తెలియజేస్తూ దేశభక్తి భావాలతో పాటు, జాతీయ సమైక్యత విలువలను పెంపొందించాలని కోరారు.సదరు చిత్ర మాలికలో సూక్తులను ముద్రించారు. చదువుతోపాటు సంస్కారం, భావ సమైక్యత జాతీయ భావాలను పెంపొందించాలన్నారు. వారం వారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తూ మహాత్ములు, మహానుభావులు చేసిన గొప్ప సేవను వారి మూర్తిమత్వ లక్షణాలను వివరిస్తూ ఈ విద్యార్థుల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎం లు, సిఆర్పిలు, ఎంఆర్సిసి సిబ్బంది పాల్గొన్నారు.

## కుషాయిగూడ పిహెచ్ సీ లో మహిళల రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ మిషన్ ప్రారంభం




ప్రజాస్ఫూర్తి, కాప్రా :కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(జమ్మిగడ్డ)లో మంగళవారంమహిళల రొమ్ము, గర్భాశయ క్యాన్సర్స్క్రీనింగ్ మిషన్ ను మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసి) వారు పిహెచ్ సీకి స్క్రీనింగ్ మిషన్ ను అందజేసారు.మాజీ ఎమ్మెల్యేలు ఎన్విఎస్ఎస్ ప్రభాకర్ బేతి సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్ రెడ్డి, ఎంపీసీ చైర్మన్ తాడూరు శ్రీనివాస్, ఐఓఎల్ స్టేట్ హెడ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పియూష్ మిట్టల్, నేషనల్ బయోడైవర్శిటీ అథారిటీ జాతీయ సభ్యులు మంకెనా శ్రీనివాస్ రెడ్డి, మహిత డైరెక్టర్ పి. రమేష్ శేఖర్ రెడ్డి, పిహెచ్ సీ ఇంచార్జీ డాక్టర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు. మహిళలకు ప్రాథమిక స్థాయిలో ఉన్న బ్రెస్ట్ క్యాన్సర్ ను గుర్తించే మిషన్ ను అంద జేయడం వల్ల మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ శోభ, పిహెచ్ సీ ఇంచార్జీ డాక్టర్ రమాదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళ మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి, కనుకుల రజనీకాంత్ రెడ్డి, షేక్ అబ్దుల్ రహీం, చల్లా ప్రభాకర్,సంపత్ రావు, కాసం మహిపాల్ రెడ్డి, సాహెబ్, తాళ్ల ఆనంద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ని సత్కరించినకాంగ్రెస్ పార్టీ జిల్లానాయకుడు



యాదగిరిగుట్ట,ప్రజా స్ఫూర్తి: అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ని మంత్రి పదవి వచ్చిన సందర్భంలో మంగళవారం ఆయనను సచివాలయం లో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆధ్వర్యంలోయాదాద్రి భువనగిరి జిల్లాకాంగ్రెస్ పార్టీ సీనియర్నాయకుడు బూడిదశ్రీనివాస్ మర్యాద పూర్వకంగాతన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలోయాదగిరిగుట్టపట్టణ కాంగ్రెస్ నాయకులు బూడిద నాగరాజుతదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి ప్రారంభమయ్యే మెగా ఆధార్ క్యాంపును సద్వినియోగ పరుచుకోవాలి..

* **మెగా ఆధార్ క్యాంప్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి**
* **జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్..**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఆధార్ కార్డులో అవసరమైన వివరాల సవరణలు చేసుకునేందుకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న మేగా ఆధార్ క్యాంపును సద్వినియోగపరుచుకోవాలనిజిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు . జూలై 9 మరియు 10 తేదీల్లో కలెక్టర్ కార్యాలయం లో ఈ క్యాంపులు నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లుకలెక్టర్తెలిపారు. ఆధార్ క్యాంపులకు విచ్చేసే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల సందేహాలు, ఆధార్ కార్డుల సవరణకు తగిన సిబ్బందిని అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. కావున ప్రజలు ఆధార్ కార్డులో తప్పులున్న వారు, కొత్త సమాచారం జత చేయాలనుకునే వారు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.ఈ ఆధార్ క్యాంపులో పలు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు . వాటిలో పేరు మార్పు లేదా సవరణ, పుట్టిన తేది సవరణ, లింగం మార్పు, చిరునామా సవరణ, మొబైల్ నంబర్ అప్డేట్, ఫోటో అప్డేట్, బయోమెట్రిక్ అప్డేట్, తల్లిదండ్రుల పేర్లను జోడించడం వంటి సేవలు ఉన్నాయి అని తెలిపారు . ప్రత్యేకంగా 5, 15 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు బయోమెట్రిక్ వివరాలు తప్పనిసరిగా నవీకరించాల్సి ఉంటుందన్నారు. అలాగే 05 ఏళ్ల పిల్లల ఆధార్లో తల్లిదండ్రుల పేర్లను జతచేసే అవకాశం కూడా ఈ క్యాంపులో కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కొన్ని వివరాలు ఆన్లైన్ ద్వారా అప్డేట్ చేయవచ్చు, మరికొన్ని మాత్రం ఆధార్ సేవా కేంద్రం నుంచే చేయాల్సి ఉంటుందని, ఉదాహరణకు, చిరునామా మార్పు ఆన్లైన్లో సాధ్యపడుతుంది కానీ మొబైల్ నంబర్ లేదా పుట్టిన తేది సవరణ వంటి సేవలు కేవలం ఆధార్ సేవా కేంద్రాల్లోనే చేయాలి. కొన్ని సవరణలకు జీవితంలో ఒక్కసారే అవకాశం ఉంటుందని అయన స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయి బృందం ఈ కేంద్రంలో అందుబాటులో ఉన్నందున దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న ఆధార్ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని కలెక్టర్ తెలిపారు.కావున ఆధార్ డేటాలో ఏవైనా సవరణలు చేయించుకోవాలనుకుంటున్న జిల్లావాసులు తప్పక ఈ మేగా ఆధార్ క్యాంపులను సందర్శించాలని, నవీకరణకు లేదా సవరణకు అవసరమైన పత్రాలను తీసుకువచ్చి తమ వివరాలను నవీకరణచేసుకోవాలని కలెక్టర్కోరారు.

## సార్వత్రిక సమ్మెతో కేంద్రం దిగిరావాలి

* **సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపుతున్నాం**
* **సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ దేశ సహజ వనరులను, ప్రభుత్వ రంగ సంస్థలను తక్కట్టుపెడుతున్న కేంద్రం తీరుకు నిరసనగా బుధవారం నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెతో కేంద్రం దిగి రావాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక 'శేషగిరిభవన్'లో అయన మీడియాతో మాట్లాడారు. మోడీ ప్రభుత్వం కార్మికులు,రైతులు,సామాన్య ప్రజల హక్కులపై దాడికి పాల్పడోతోందని, ప్రజాస్వామ్య, రాజ్యంగ హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. కేంద్రం తీసుకువస్తున్న సంస్కరణలు, చట్టాలు దోపిడీ వర్గాలకు మేలుచేసే విధంగా ఉన్నాయని, కార్మికులు, ప్రజలకోసం కాకుండా కార్పొరేట్ సంస్థలకోసమే పనిచేస్తున్నదని ఆరోపించారు. పోరాటాలు, ప్రాణత్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను యాజమాన్యాలకు అనుకూలంగా మార్చేందుకు కేంద్రం కుట్రచేస్తోందని, విమర్శించారు. ధరలను నియంత్రించడంలో కేంద్రం విఫలం చెందడంతో పేద, సామాన్య ప్రజలు రెండుపూటలా తినలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సమ్మె విజయవంతంకోసం జిల్లా వ్యాపితంగా సిపిఐ శ్రేణులు, అనుబంధ కార్మిక, ప్రజాసంఘాలు కృషిచేయాలని పిలుపునిచ్చారు. అన్నివర్గాల ప్రజలను ఇబ్బందులపాలు చేస్తున్న కేంద్రానికి సార్వత్రిక సమ్మె గుణపాఠం కావాలని, సంఘటిత, అసంఘటిత కార్మికులు, ఉద్యోగులు సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని, ప్రజలు, వ్యాపారవర్గాలు సమ్మెకు సహకరించాలని సాబీర్ పాషా కోరారు.

## వై ఎస్ రాజశేఖర్ రెడ్డి సుపరిపాలన, అభివృద్ధి ఎప్పటికి మర్చిపోలేనిది

* **కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : దివంగతవై ఎస్ రాజశేఖర్ రెడ్డి సుపరిపాలన,అభివృద్ధి, రజనీతిగ్నమైన ఆలోచనలు ఎప్పటికి మర్చిపోలేనివని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వై ఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలిసి షాపూర్ నగర్ చౌరస్తా వరకు కాలినడకన బయలుదేరి.. దివంగత ముఖ్యమంత్రి వై ఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ వై ఎస్ ఆర్ వ్యవసాయానికి ఉచిత విద్యుత్, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, మహిళ సంఘాల అభివృద్ధికి పావలా వడ్డీకే రుణాలు అందించారాని గుర్తుచేశారు. ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో ఆరోగ్య శ్రీ, 108,104 అలాగే విద్యార్థుల భవిషత్తు దృష్ట్యా ఫిజు రియంబర్స్మెంట్ ఇలా అనేక పథకాలు ప్రవేశపెట్టి రాష్ట్ర అభివృద్ధికి చాలా కృషి చేశారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళ సంఘాల నాయకురాలు, యువజన సంఘాల నాయకులు, ఎన్ఎస్యుఐ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు..



## ఎమ్మెల్యే ని కలిసిన చక్రిపురం కాలనీ నూతన కార్యవర్గం



ప్రజాస్ఫూర్తి, కాప్రా : చర్లపల్లి డివిజన్కు చెందిన చక్రిపురం కాలనీలో ఇటీవల జరిగిన చక్రిపురం సంక్షేమ సంఘం ఎన్నికల్లో గడ్డల పాండు ముదిరాజ్ అధ్యక్షుడిగా, సోమసాని అశోక్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా మంగళవారం నూతన కార్యవర్గ సభ్యులు సైనిక్ పూరి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీలో ఉన్న ప్రధాన సమస్యలపై ఎమ్మెల్యే తో చర్చ జరిపారు. ముఖ్యంగా డ్రైనేజీ, రోడ్డు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిమాట్లాడుతూ, కాలనీలో ఉన్న సమస్యలను నా దృష్టికి తీసుకురావడం అభినందనీయం. వీటి పరిష్కారానికి నేను అవసరమైన కృషి చేస్తాను అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ రాఘవ రెడ్డి, ఉపాధ్యక్షులు కొండారెడ్డి, లాల్ సింగ్, సంయుక్త కార్యదర్శులు బీ. భాస్కర్ రెడ్డి, ఎర్రయ్య, కోశాధికారి జగన్మోహన్ రెడ్డి, ఉప కోశాధికారి యాకయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఎం. చంద్ర రెడ్డి, వి. బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

## ఒక రైతుకు 3300 గజాలు వెంటనే అలాట్ మేంట్ ఇవ్వాలి

* **మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూరమల్లారెడ్డి**




మేడ్చల్, (ప్రజాస్ఫూర్తి) : ఒక రైతుకు 3300 గజాలు వెంటనే అలాట్ మేంట్ ఇవ్వాలనిమాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూరమల్లారెడ్డి అన్నారు. బోడుప్పల్ దళిత సోదరుల భూమిసర్వే నంబర్63/2నుంచి63/25. 234ఎకరాలు ల్యాండ్ పులింగ్ ఆగిపోయిన సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టర్ మాను చాదరి ని బోడుప్పల్ దళితులు తో కలిసి వెంటనే ల్యాండ్ పులింగ్ చేయాలని కోరారు. 15 రోజులలో అలాట్మెంట్ లెటర్ ఇస్తాను అని కలెక్టర్ హామీ ఇవ్వడం జరిగింది.ఈ సమావేశం లోఎమ్మెల్యే తో పాటు తోటకూర వజ్రష్ యాదవ్,మంద సంజీవ రెడ్డి, మీసాల కృష్ణ, చిన్నగాలా కుమార్, చంటి, శ్రీను, రాపోలు, ఉపేందర్, కే నర్సింహా అంబేద్కర్ సంఘము నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చెప్పింది చేయడం, చేసేది చెప్పడం వైఎస్సార్ లక్షణం

**: బొంతు శ్రీదేవి యాదవ్**

* **వైఎస్సార్ జయంతి వేడుకల్లో ఘన నివాళులు**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : చర్లపల్లి డివిజన్లోని భరత్ నగర్లో మాజీ ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ఘనంగా నివాళులు అర్పించారు. వైఎస్సార్చిత్రపటానికి పూలమాల వేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్చెప్పింది చేయడం, చేసేది చెప్పడం అనే నిజాయితీతో ప్రజల మనసుల్లో నిలిచిపోయిన నాయకుడు. రైతు బిడ్డలకు ధైర్యాన్నిచ్చిన నేత. నిరుపేదల కోసం ఆరోగ్యశ్రీ, 108 వంటి పథకాలతో సాటి లేదు. ఆయన పాలన ప్రజల పాలనకు సజీవ ప్రతీక. ఆయన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ అభిమానులు, స్థానిక నాయకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెరుగుతున్న కాలుష్యాన్ని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

*** ప్రపంచ పర్యావరణ సంస్థ ప్రతినిధి భద్ర**






జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : పెరుగుతున్న కాలుష్యాన్ని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ప్రపంచ పర్యావరణ సంస్థ ప్రతినిధి భద్ర అన్నారు. మంగళవారం ట్రస్మా ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మగ్దూంనగర్,భగత్ సింగ్ మార్గ్ లోని చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో "పర్యావరణ పరిరక్షణ "పై నిర్వహించిన అవగాహన సదస్సు లో ప్రపంచ పర్యావరణ సంస్థ ప్రతినిధి భద్ర తో పాటు ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు,పాఠశాల చైర్మన్ కరస్పాండెంట్ శివరాత్రి యాదగిరి లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా భద్ర మాట్లాడుతూ భవిష్యత్ తరాల మనుగడ కోసం పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు.ప్రతి ఒక్కరు ఇంటింటికి మొక్కలు నాటి ముందు తరాల వారికి స్వచ్ఛమైన గాలిని అందించాలన్నారు. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు చైతన్య విద్యానికేతన్ విద్యాసంస్థల చైర్మన్ కరస్పాండెంట్ శివరాత్రి యాదగిరి మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ సంస్థ చేస్తున్న పర్యావరణ పరిరక్షణ ఉద్యమానికి తెలంగాణ రికగ్నైజడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ మద్దతు ప్రకటించినట్టు తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.పురవీధులలో విద్యార్థులు, ఉపాధ్యాయులచే ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ శివరాత్రి మంగ,డైరెక్టర్లు శివరాత్రి నిఖిల్,శివరాత్రి సాయి,పాఠశాల ఇన్చార్జి గీత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రెడ్డి జాగృతి ఆత్మీయ సన్మాన మహోత్సవం



హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : నగరంలోని రవీంద్రభారతిలో జరిగిన రెడ్డి జాగృతి ఆత్మీయ సన్మాన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రెడ్డి జాగృతి అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా నుండి పెద్ద సంఖ్యలో రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు బట్టెంగారి మాధవ రెడ్డి పిలుపు మేరకు వివిధ రంగాల్లో గుర్తించబడిన రెడ్డి సహోదరులకు సన్మానం చేశారు.ఇందులోరెడ్డి జాగృతి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డితో పాటు రెడ్డి జాగృతి, సంక్షేమ సంఘం నాయకులు కేశిరెడ్డి హనుమంతు రెడ్డి,గడ్డం రాజేశ్వర్ రెడ్డి,చిట్టిరెడ్డి గోపాల్ రెడ్డి,ఈరెడ్డి దేవేందర్ రెడ్డి,కర్ల తిరుపతి రెడ్డి,కేసిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి.ధోంతిరి భాస్కర్ రెడ్డి,ముత్యం వెంకట్ రెడ్డి, డాకురి అక్కిరెడ్డి,చిదురుప్ప కృష్ణారెడ్డి,పెద్దిబావి వీరారెడ్డి, తనుజ రెడ్డి వడాల,మల్లారెడ్డి విప్ప విష్ణువర్ధన్ రెడ్డి,దొంతిరి సోమిరెడ్డి,వంగూరు శరత్ రెడ్డి,దొడ్ల సాయిరెడ్డి, మహిపాల్ రెడ్డి,వంగేటి మోహన్ రెడ్డి,దుబాల వేణుగోపాల్ రెడ్డి,నల్ల అనంతరెడ్డి,మర్రెడ్డి సతీష్ రెడ్డి తదితరులకు ఈ కార్యక్రమంలో సన్మానించారు.

## జర్నలిస్టులకు ఆధార్ ప్రత్యేక కౌంటర్..

*** టీయూడబ్ల్యూజే ఐజేయు విజ్ఞప్తి.**

*** హామీ ఇచ్చిన అదనపు కలెక్టర్ వేణుగోపాల్.**



భద్రాద్రి కొత్తగూడెం, (ప్రజాస్ఫూర్తి) : ఆధార్ కార్డులోసవరణల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్యాంప్ లో జర్నలిస్టుల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని టీయుడబ్ల్యూజే ఐజేయు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ఇమంది ఉదయ్ కుమార్ మంగళవారం అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఆధార్ ఈడీఎం సైదేశ్ కు ఆదేశాలు ఇచ్చారు ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల కోసం ఈ మెగా క్యాంపు అనంతరం త్వరలోనే ప్రత్యేకంగా ఏర్పాటుచేసి తేదీలు తెలియజేస్తామని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సామాన్య ప్రజల కోసం ఏర్పాటుచేసిన ఈ మెగా ఆధార్ సవరణల కేంద్రంలో ఇబ్బంది పడకుండా జర్నలిస్టులందరి కోసం ఏర్పాటు చేసే తేదీలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రతిష్టాత్మక దేశంలోనే తొలిసారిగా ఏర్పాటుచేసిన ఆధార్ సవరణల మెగా క్యాంప్ జూలై 9, 10 వ తేదీలలో జిల్లాలోని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తెలిపారు.ఈకార్యక్రమంలో ఉదయ్ కుమార్ తో పాటు ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏర్పుల సుధాకర్ పాల్గొన్నారు.

## 'శబరి' ఇక సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్

హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వేగవంతంగా అమలు చేయడానికి జిల్లాల హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్లు(పీడీ)గా గ్రూప్ 1 అధికారులను ప్రభుత్వం నియమిస్తోంది. ఇప్పటికే భద్రాద్రి కొత్తగూడెం,గద్వాల,మహబూబాబాద్,ఆసిఫాబాద్,నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలకు కొత్త పీడీలను నియమించింది. వీరంతా రెవెన్యూశాఖలో డిప్యూటీ కలెక్టర్ల స్థాయి అధికారులుగా ఉన్నారు. డిప్యుటేషన్‌పై వీరిని గృహనిర్మాణ శాఖకు బదిలీ చేసింది. అయితే, హౌసింగ్ పీడీలుగా ఎస్ఈ స్థాయి అధికారులు ఉండాలి. పలు జిల్లాల్లో డీఈఈ, ఈఈలు పీడీలుగా ఉన్నారు. ఈ పథకం అమల్లో అనుకున్నంత వేగాన్ని డీఈఈ, ఈఈలు అందుకోవడం లేదు. దీంతో పలు జిల్లాల్లో పథకం నత్తనడకన సాగుతోంది.

## ఘనంగా వైఎస్ఆర్ జయంతి వేడుకలు

ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఇల్లందు మున్సిపాలిటీ, ఉమ్మడి ఆంధ్రపదేశ్ మాజీ ముఖ్యమంత్రి వర్యులు, దివంగత నేత, ప్రియతమనేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి 75 వ జయంతి సంధర్భంగా, ఇల్లందు పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైయస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించి, అనంతరం పట్టణంలోని జగదాంబ సెంటర్లో గల డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డిజయంతి సందర్భంగా వారి విగ్రహానికి పూలమాలతో, ఘనంగా నివాళులర్పించి న అనంతరం ఇల్లందు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్డ డానియల్ మాట్లాడుతూ, డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి పేదల పాలిట పెన్నిధి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పేదలందరికీ ఇందిరమ్మ గృహాలు నిర్మించిన గొప్ప మహానుభావుడు, అంతే కాకుండా, పేద ప్రజల కోసం ఆరోగ్యశ్రీ అను గొప్ప పథకాన్ని ప్రవేశపెట్టి, ఎంతోమంది పేదలకు ఆయన దేవుడయ్యారని, అలాంటి మహానేత వైయస్సార్ అని వారు కొనియాడారు,ఈ కార్యక్రమంలో ఇల్లందు పట్టణ కాంగ్రెస్ పార్టీ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎండి జాఫర్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శన్ కోరి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మడుగు సాంబమూర్తి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జానీ పాషా, ఐ ఎన్ టి సి సీనియర్ నాయకులు ఇమామ్, మాజీ వర్డ్ కౌన్సిలర్లు ఆజాం, అంకె పాక నవీన్, యాకూబ్, ఎల్ కృష్ణ. జెట్టి కిషోర్, బోళ్ల సూర్యం, చల్ల శ్రీనివాసరావు, ఇల్లందు హరిహర క్షేత్రం దేవాలయ చైర్మన్ గందే సదానందం, వచ్చా వెంకన్న, ఎనగంటి శ్రీను, గుండంపెల్లి సతీష్, పందిళ్ళ వెంకన్న, సాతిల్ల యాదగిరి, మల్లేశ్వరి, చెంచమ్మ, సలీం, కుమ్మరి కోటయ్య, ఇంకా ఇతరులు పాల్గొన్నారు.

## ఒక్కరోజు టో కెన్ సమ్మెతో, కోల్పోనున్న వేతనాలు!

*** ఈనెల 9 న నిర్వహిస్తున్న రాజకీయ సంఘాలు చేస్తున్న**

*** దేశ వ్యాప్త సమ్మెకు బి ఎం ఎస్ దూరం.**

ప్రజాస్ఫూర్తి, ఇల్లందు :కార్మికులారా ఆలోచించండి... ఒక్కరోజు టోకెన్ సమ్మె కారణంగా బొగ్గు పరిశ్రమల పనిచేస్తున్న కార్మికుల తమ వేతనాలు కోల్పోవడమే తప్ప మరి ఇంకోటి ఉండదని, రాజకీయ స్వలాభం కోసంకొన్ని కార్మిక సంఘాలు బొగ్గు పరిశ్రమలు ఈనెల తొమ్మిదో తేదీనపిలుపునిచ్చాయని, గత 15 ఏళ్లుగా ఏడాదికిఒక రోజు దేశవ్యాప్తంగా కార్మిక సమ్మె అని నిర్వహిస్తున్న రాజకీయ కార్మిక సంఘాలు సాధించింది ఏది ? ఎక్కడ? ఎవరి కోసం సమ్మె చేస్తున్నారని కార్మికులకు చెప్పాల్సి న అవసరం ఉందని కార్మిక రంగంలో కనుమరుగు అవుతున్నామని, కార్మికులను అడ్డంపెట్టుకొని స్వలాభాల కోసం, రాజకీయ అవసరాల కోసం సమ్మె చేస్తున్నారనిఏడాదిలో ఒక్క రోజు సమ్మె వల్ల కార్మికులకు ఒరిగింది ఏమి ఉండదని, కార్మిక సంక్షేమమే ధ్యేయంగా కార్మికుల కోసం అయితే మీ జెండాలు, మీ ఎజెండాలు పక్కకు పెట్టి కార్మికుల కోసం పోరాడదాం అంటూ పిలుపునివ్వడం మీరు సిద్ధమా? అని బి.ఎం.ఎస్ ప్రశ్నిస్తుందని పేర్కొన్నారు. వీళ్లదంతా రాజకీయ పరంగా బీజేపీ పై పోరాటం తప్ప మరొకటి లేదన్నారు.రాజకీయ పార్టీలకు అనుబంధంగా ఉన్న కార్మిక సంఘాలు చెపుతున్న డిమాండ్లు ప్రధానంగా కనీస వేతనాలు పెంచాలని మాత్రమే తప్ప కార్మిక శ్రేయస్సు కానీ, సంస్థ పురోభివృద్ధికి కానీ ఏనాడు ముందుకు రాలేదని.కేంద్ర ప్రభుత్వం 2014లోనే కేంద్ర ప్రభుత్వం కనీస వేతనాలు పెంచారని,ఇప్పుడు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలో పని చేస్తున్న కార్మికులకు వి డి ఏతో కనీస వేతనం రూ.21,000/, రాష్ట్ర పరిధిలో ఉన్న పరిశ్రమలలో కాంట్రాక్టు కార్మికులకు రూ. 12,300/లు మాత్రమే ఇస్తున్న విషయం రాజకీయ పార్టీలు గానీ ఆయా కార్మిక సంఘాల కాని తెలవదా అని వ్యాఖ్యానించారు . దీని గురించి గత 15 ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వాలపై బిఎంఎస్ పోరాటం చేస్తుందని,వీరు రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా ప్రక్కన చేరిపోతారని, ఇప్పుడు పోరాటం కేంద్ర ప్రభుత్వ కనీస వేతనం రూ.21,000/ చేసినందుకా సమ్మె ? చేయాలి అని వ్యాఖ్యానించారు.పని గంటలు పెరుగుతున్నాయని కార్మికులను తప్పుద్రోవ పట్టిస్తున్నారని ఆరోపించారు.దేశ వ్యాప్తంగా పని గంటలు వారానికి 48 గంటలు మాత్రమేనని అంతకు మించి చేస్తే ఓటీ,సి ఆఫ్ అని కార్మికులకు తెలిసిందేనాన్నారు.కేంద్ర ప్రభుత్వం రోజుకు 12 గంటల చొప్పున 4 రోజులు పని చేయాలని అలాగైనా వారానికి 48 గంటలు మాత్రమేనని పేర్కొన్నారు. మిగతా 3 రోజులు సెలవులు, దీని వల్ల కార్మికులకు సమయం, డబ్బులతో పాటు కుటుంబ సభ్యులతో గడపడానికి వీలు పడుతుందని పేర్కొన్నారు.ఈ నిర్ణయం, ఇది కూడా బలవంతంగాఏమి కాదన్నారు. పరిశ్రమల యాజమాన్యాలదే తుది నిర్ణయమని ఇది అసలు కథని, దీనిని మార్చి పని గంటలు పెరుగుతున్నాయని చెప్పడం వీళ్ళ దివాళకోరు తనానికి నిదర్శనమని



ఆరోపించారు. ఇకపోతే లేబర్ కోడ్లు గురించి ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. దేశంలో ఇప్పుడున్న కార్మిక చట్టాలు బ్రిటిష్ కాలము నాటివని, వీటి వల్ల కార్మికులకు ఎలాంటి న్యాయం జరగడం లేదని,రెండు దశాబ్దాలుగా దేశంలో అన్ని కార్మిక సంఘాలు కార్మిక చట్టాలను మార్చాలని డిమాండ్ చేశారని పేర్కొన్నారు. అందు వల్లనే కేంద్ర ప్రభుత్వం మార్చడానికి ప్రయత్నిస్తుందని,బ్రిటిష్ కాలము నాటి కార్మిక చట్టాలతో సంఘటిత, అసంఘటిత రంగాలలో సుమారుగా 60కోట్ల మంది కార్మిక రంగంలో పనిచేస్తుంటే ఇప్పుడు ఉన్న చట్టాలు కేవలం 6, 7 కోట్ల మందికే ఉపయోగపడుతున్నాయని వివరించారు. బిఎంఎస్ 4 కోడ్స్ లలో 2 కోడ్ లను స్వాగతించిందని.సామాజిక భద్రత కోడ్ 2020, దీనిలో మొదటి సారిగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో కేంద్ర ప్రభుత్వమే కనీస వేతనాన్ని నిర్ణయించే హక్కుఉంటుందన్నారు . రాష్ట్ర ప్రభుత్వాలకు అంతకన్నా ఎక్కువ కనీస వేతనాన్ని పెంచే నిర్ణయాన్ని రాష్ట్రాలకే వదిలేస్తుందని, దీనితో రాష్ట్రాల ప్రభుత్వాలకు సంబంధం లేకుండా ప్రతి 5 సం||లకు ఒకసారి పెంచాలని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కనీస వేతనాలను పెంచుతుందని దీనిని వీళ్ళు వ్యతిరేకిస్తున్నారని వివరించాసారు. సామాజిక భద్రత కోడ్ 2020, ఈ చట్టం క్రింద గిగ్,ప్లాట్ ఫామ్ కార్మికులకు మొదటి సారిగా సామాజిక భద్రతతో పాటు ఇ ఎస్ ఐచందాదారుడు కాకపోయినా చికిత్సలు, సేవలు వర్తిస్తాయని అసంఘటిత రంగ కార్మికులకు కూడా లబ్దిచేకూరుతుందని పేర్కొన్నారు. ఈ 2 కోడ్స్ వలస కార్మిక రంగానికి మేలు జరుగుతుందనిబి ఎం ఎస్ స్వాగతిస్తుందన్నారు. మిగతా రెండు కోడ్స్ లో కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న సెక్షన్లను మార్చాలని, బిఎం ఎస్కేంద్ర ప్రభుత్వం పై పోరాడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ రెండు కోడ్స్ లలో తప్పకుండా సవరణలు చేయాల్సిందేనని, ఇది బి ఎం ఎస్డిమాండని తెలిపారు. మిగతా కార్మిక సంఘాలు, కార్మికులకు లేబర్ కోడ్స్ లో ఉన్నవి చెప్పకుండా కల్లబొల్లి మాటలు నూరిపోసి రాజకీయ పబ్బం గడుపుకోవడానికి దేశవ్యాప్త రాజకీయ సమ్మె అంటూ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. అందువల్లనే బీఎంఎస్ -ఎస్ సీ ఎంకెఎస్ మద్దతు ఇవ్వడం లేదని ఇల్లందు ఏరియాసింగరేణి కార్మికులు, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు అందరూ కూడా తొమ్మిదో తారీఖున అందరూ విధులకు హాజరుకావాలని బి.ఎం.ఎస్ పిలుపునిస్తోంది ఇల్లందు ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాయని సైదులు సెక్రెటరీ లీలా కృష్ణ సెంట్రల్ కమిటీ మెంబర్ ఆరుట్ల మాధవరెడ్డి జాయింట్ సెక్రెటరీ నాగేశ్వరరావు, పిట్ కమిటీ బృందం శ్రీనివాస్ కిషోర్ శశి రాజశేఖర్ ప్రవీణ్ ప్రదీప్ మొదలైన వారుకార్మికులు విధులకు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

## మాజీ సీఎం వైఎస్ఆర్ ప్రజల హృదయాలలో మహారాజుగా నిలిచారు..

*** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : మాజీ సీఎం వైఎస్ఆర్ ప్రజల హృదయాలలో మహారాజుగా నిలిచి పేద ప్రజలకు అండగా నిలిచారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డిఅన్నారు. స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి జన్మదినంసందర్భంగా ప్రగతినగర్, రాజీవ్ గృహకల్ప లోని వై ఎస్ ఆర్ విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసిఆయనను స్మరిస్తూ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కుమార్ యాదవ్,వీరబాబు గౌడ్, రవీందర్ రెడ్డి, సాగర్ రెడ్డి, బండ్ల విజయ్ కుమార్, నారాయణ రెడ్డి, రఫత్, తులసి దాస్, బొట్టు రవీందర్, ఆదిరెడ్డి, రవికుమార్, ఏ వి రెడ్డి, భాస్కర్ రెడ్డి, సురేందర్ యాదవ్, అంబారెడ్డి, మందలపు రమేష్,పంగా శ్రీనివాసరావు,శ్రీశైలం యాదవ్,మౌలేశ్వరరావు, సత్య ప్రసాద్, ప్రేమకుమార్, రఘు, మహిపాల్, లక్ష్మణ్, ప్రభాకర్ రెడ్డి, బాలకృష్ణ, పీతాని శ్రీనివాసరావు, వెంకట్ రెడ్డి, ఆటో శ్రీను, గౌస్, రామానాయుడు, సుధాకర్, సుదర్శన్,చిరంజీవి, రామచంద్రనాయక్, నాగభూషణం, ఏడుకొండలు,భుజంగరావు, శివ నాగరాజు యాదవ్, రాధా, జ్యోతి,మార్తమ్మ, సరిత రెడ్డి, నవ్య, సత్యవతి, చిన్ని, వరలక్ష్మి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత వైఎస్సాఆర్

*** ఘనంగా వైఎస్సాఆర్ జయంతి వేడుకలు**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్సాఆర్ అని కాంగ్రెస్ పార్టీ ముస్తాబాద్ మండల అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఘనంగా వైఎస్సాఆర్ 76వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సాఆర్ చిత్ర పటానికి నాయకులు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2004 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి అనేక సంస్కరణలు చేసి పేద బీద మధ్యతరగతి ప్రజల అభివృద్ధి లక్ష్యంగా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిన మహనీయుడు వైఎస్సాఆర్ అని అన్నారు. పేదవారికి పెద్దపెద్ద చదువులు చదవడం అంటే అప్పట్లో చాలా ఇబ్బందులు పడేవారు కానీ వైఎస్సాఆర్ ఇంజనీరింగ్, మెడిసిన్ లాంటి పెద్ద పెద్ద చదువులను కూడా ఫీజు రియంబర్స్మెంట్ ద్వారా అందించి వారి ఉన్నత చదువుకులకు ఎంతో తోడ్పడ్డారని అన్నారు. హైదరాబాద్‌కి ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్, ఎన్నో ఐటి పరిశ్రమలను స్థాపించి హైదరాబాదును అభివృద్ధిలో మరో స్థాయికి తీసుకెళ్లారు అన్నారు. వైఎస్సాఆర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజ్జల రాజు, నాయకులు, కార్యకర్తలున్నారు.

## వీరభద్ర స్వామి హుండీ ఆదాయం 18 లక్షలు ఆలయ కమిటీ చైర్మన్ మద్ది ప్రతాప్ రెడ్డి

పటాన్ చెరు(గుమ్మడిదల),ప్రజాస్ఫూర్తి 8 ; గుమ్మడిదల మున్సిపల్ పరిధిలో వీరన్న గూడెం లో గల శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో మంగళవారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజనల్ ఇన్స్పెక్టర్ రంగారావు, ఆలయ చైర్మన్ ప్రతాప్ రెడ్డి పర్యవేక్షణలో లెక్కింపు కార్యక్రమం కోనసాగింది.113 రోజుల హుండీ ఆదాయం 18,92,153/రూపాయలు వచ్చిందని ఆలయ కమిటీ చైర్మన్ మద్ది ప్రతాపరెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్నార్య నిర్వహణ అధికారి శశిధర్ గుప్తా, ధర్మకర్తలు అశోక్ గౌడ్, భాస్కర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, యాదగిరి గౌడ్, వీరస్వామి, కృష్ణ, నాయకులు నాగేందర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, వేణు, లక్ష్మీనారాయణ, ఆలయ, అర్చక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు .





# కాంగ్రెస్‌ది ప్రజా వంచన పాలన

* **బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్ రావు**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ చేస్తున్నదని ప్రజా పాలన కాదని, ప్రజా వంచన పాలనని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్ రావు విమర్శించారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ నోటి కొచ్చిన 420 హామీలు, వాగ్దానాలు ఇచ్చిందని, వంద రోజుల్లో ఆరు గ్యారంటీల అమలు నెరవేర్చలేకపోయారని అన్నారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీల అమలుకు మాది గ్యారంటీ అని బాండ్ పేపర్ మీద రాసి గద్దెనెక్కి 18 నెలల తర్వాత కూడా ఒక్కటంటే ఒక్క హామీని కూడా రేవంత్ రెడ్డి సర్కార్ నెరవేర్చలేకపోయిందని అన్నారు. రైతులకు ఎన్నికల ముందు 15 వేల ఇస్తామన్న రైతు భరోసాను 12 వేలకు కుదించిందని అన్నారు. కౌలు రైతుకు ఇస్తామన్న రైతు భరోసా ఎక్కడ అన్ని ప్రశ్నించారు. ప్రతి క్వింటాలకు ఇస్తామన్నా 500 బోనస్‌ను బోగస్ అని, మహాలక్ష్మి స్కీం క్రింద ప్రతి గృహిణికి ఇస్తానన్న 2500 రూపాయలు సంగతేంటి నిలదీశారు. 6 గ్యారంటీలు 420 హామీలతో అధికారంలోకి వచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదు కాబట్టి, రేపు జరిగబోయే స్థానిక ఎన్నికలకు ఊరూరా, ఇంటింటికి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతామని, అప్పుడు ప్రజలే తగిన బుద్ధి చెబుతారు అన్నారు. ఈ సమావేశంలో సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి , జిల్లా మాజీ కో ఆప్షన్ సభ్యులు సర్వర్ పాషా, మాజీ సెస్ డైరెక్టర్ కొమ్ము బాలయ్య, బీఆర్ఎస్ ముస్తాబాద్ పట్టణ అధ్యక్షులు ఎద్దండి నరసింహారెడ్డి, ముస్తాబాద్ మండల మాజీ కో అప్షన్ మెంబర్ అన్వర్, ముస్తాబాద్ మాజీ పట్టణ అధ్యక్షులు గూడూరి భరత్ పాల్గొన్నారు.

# మస్క్ కు షాకిచ్చిన అమెరికా ఎయిర్ ఫోర్స్

* **స్పేస్‌ఎక్స్‌తో చేపట్టాల్సిన హైపర్సోనిక్ రాకెట్ పరీక్షలకు బ్రేక్**
* **పర్యావరణ కారణాలతో నిలిపివేసిన యూఎస్ వైమానిక దళం**
* **పసిఫిక్ దీవి జాన్‌స్టన్ అటాల్‌లో జరగాల్సిన ప్రయోగాలు**



అమెరికా తలపెట్టిన అత్యంత ప్రతిష్ఠాత్మక హైపర్ సోనిక్ రాకెట్ కార్గో ప్రాజెక్టుకు పర్యావరణవేత్తల నుంచి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థతో కలిసి చేపట్టాలనుకున్న ఈ ప్రయోగాలను పర్యావరణ కారణాలతో నిలిపివేస్తున్నట్లు యూఎస్ వైమానిక దళం ప్రకటించింది. పసిఫిక్ మహాసముద్రంలోని మారుమూల వన్యప్రాణుల సంరక్షణ కేంద్రమైన జాన్‌స్టన్ అటాల్ దీవిలో ఈ పరీక్షలు నిర్వహించాలని తొలుత ప్రణాళిక వేశారు. హవాయికి నైరుతి దిశలో దాదాపు 1300 కిలోమీటర్ల దూరంలో ఈ దీవి ఉంది. ఇక్కడ లక్షలాది సముద్ర పక్షులు గూళ్లు కట్టుకుని నివసిస్తుంటాయి. ఈ ప్రాంతంలో హైపర్సోనిక్ రాకెట్ పరీక్షలు నిర్వహిస్తే, ఆ పక్షుల జీవనానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని జీవశాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై పర్యావరణవేత్తల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో, యూఎస్ వైమానిక దళం వెనక్కి తగ్గింది. ఈ ప్రాజెక్టు కోసం పర్యావరణ ప్రభావంపై ఒక అంచనా నివేదికను విడుదల చేయాలని వైమానిక దళం భావించింది. అయితే, పర్యావరణ సమూహాల నుంచి వచ్చిన ఒత్తిడి కారణంగా ఈ ప్రక్రియ కూడా ఆలస్యమైంది. చివరికి, పక్షుల సంరక్షణకే ప్రాధాన్యతనిస్తూ ఈ కీలక ప్రాజెక్టును నిలిపివేయాలని నిర్ణయించినట్లు ప్రముఖ అమెరికన్ సైనిక పత్రిక స్టార్స్ అండ్ స్ట్రైప్స్ తన నివేదికలో వెల్లడించింది.

# శ్రీరాముడి జన్మస్థలంపై నేపాల్ ప్రధాని వివాదాస్పద వ్యాఖ్యలు

* **శ్రీరాముడి జన్మస్థానంపై మరోసారి నేపాల్ ప్రధాని వ్యాఖ్యలు**
* **రాముడు పుట్టింది నేపాల్‌లోనేనని స్పష్టం చేసిన కేపీ ఓలీ**
* **వాల్మీకి రామాయణమే ఇందుకు ఆధారమని వెల్లడి**





నేపాల్ ప్రధానమంత్రి కేపీ శర్మ ఓలీ మరోసారి శ్రీరాముడి జన్మస్థలంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. శ్రీరామచంద్రుడు భారతదేశం zలోని అయోధ్యలో కాకుండా, తమ దేశమైన నేపాల్‌లోనే జన్మించారని ఆయన పునరుద్ఘాటించారు. ఖాట్మండులో జరిగిన పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వాదనను వినిపించారు. తాను సొంతంగా ఈ మాటలు చెప్పడం లేదని, వాల్మీకి రాసిన అసలైన రామాయణం ఆధారంగానే ఈ విషయం చెబుతున్నానని కేపీ ఓలీ స్పష్టం చేశారు. రాముడు పుట్టిన నిజమైన ప్రదేశం నేపాల్‌లోనే ఉందని, ఈ నిజాన్ని ప్రచారం చేయడానికి ప్రజలు ఏమాత్రం వెనుకాడొద్దని ఆయన పిలుపునిచ్చారు. గతంలో 2020లో కూడా ఓలీ ఇదే తరహా వ్యాఖ్యలు చేయడం గమనార్హం. తమ దేశంలోని చిత్వాన్ జిల్లా థోరి ప్రాంతమే అసలైన అయోధ్య అని, అక్కడే రాముడు జన్మించారని అప్పట్లో పేర్కొన్నారు. కేవలం రాముడే కాకుండా, శివుడు, విశ్వామిత్రుడు కూడా తమ దేశంలోనే జన్మించారని ఓలీ తాజాగా తెలిపారు. ఇతిహాసాల్లో పేర్కొన్న పలు ప్రదేశాలు ప్రస్తుతం నేపాల్‌లోని సున్‌సారి జిల్లాలో ఉన్నాయని ఆయన అన్నారు.

# ఢిల్లీలో పాత వాహనదారులకు ఊరట...

# ఇంధనంపై నిషేధం నవంబర్‌కు వాయిదా

* **ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో పాత వాహనాల యజమానులకు తాత్కాలిక ఊరట**
* **ఇంధనం నింపడంపై నిషేధాన్ని నవంబర్ 1వ తేదీకి వాయిదా వేసిన కేంద్ర కమిటీ**
* **జూలై 1 నుంచి అమలవ్వాల్సిన నిబంధనపై ఢిల్లీ ప్రభుత్వ అభ్యంతరం**
* **10 ఏళ్లు దాటిన డీజిల్, 15 ఏళ్లు దాటిన పెట్రోల్ వాహనాలకు ఈ నిబంధన వర్తింపు**
* **ఏఎన్‌పీఆర్ కెమెరాల ద్వారా కాలం చెల్లిన వాహనాల గుర్తింపు**
* **ఢిల్లీతో పాటు మరో ఐదు ఎన్‌సీఆర్ జిల్లాల్లో నవంబర్ నుంచి కఠినంగా అమలు**



దేశ రాజధాని ఢిల్లీ, దాని పరిసర ప్రాంతాల్లో (ఎన్‌సీఆర్) కాలం చెల్లిన వాహనాల యజమానులకు కేంద్ర వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎం) తాత్కాలికంగా ఊరట కల్పించింది. పాత వాహనాల్లో ఇంధనం నింపడాన్ని నిషేధిస్తూ జారీ చేసిన ఆదేశాల అమలును ఈ ఏడాది నవంబర్ 1వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. వాస్తవానికి ఈ నిబంధన జూలై 1 నుంచే అమల్లోకి రావాల్సి ఉంది. గడువు ముగిసిన వాహనాల వల్ల వాయు కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో, 10 ఏళ్లు దాటిన డీజిల్ వాహనాలు, 15 ఏళ్లు దాటిన పెట్రోల్ వాహనాలకు ఇంధనం అమ్మరాదని సీఏక్యూఎం గతంలో ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఈ నిర్ణయం తొందరపాటు చర్య అవుతుందని, దీని అమలుకు అవసరమైన కార్యాచరణ, మౌలిక సదుపాయాల పరంగా సవాళ్లు ఉన్నాయని ఢిల్లీ పర్యావరణ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా సీఏక్యూఎంకు లేఖ రాశారు. ప్రజల నుంచి కూడా వ్యతిరేకత రావడంతో ఈ అంశాన్ని సమీక్షించిన కమిటీ, నిషేధం అమలును వాయిదా వేయాలని నిర్ణయించింది. ఈ కొత్త నిబంధన నవంబర్ 1 నుంచి ఢిల్లీతో పాటు గుర్గావ్, ఫరీదాబాద్, ఘజియాబాద్, గౌతమ్ బుద్ధ నగర్, సోనిపట్ జిల్లాల్లో అమల్లోకి రానుంది. దీనికోసం పెట్రోల్ బంకుల వద్ద ఆటోమేటెడ్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్) కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కెమెరాలు వాహనం నంబర్ ప్లేట్‌ను స్కాన్ చేసి, 'వాహన్' డేటాబేస్ ద్వారా దాని వయసును గుర్తిస్తాయి. వాహనం కాలం చెల్లినదని తేలితే, ఇంధనం నింపవద్దని సిబ్బందిని అప్రమత్తం చేస్తాయి. నిబంధనల ఉల్లంఘనలను నమోదు చేసి, తదుపరి చర్యల కోసం సంబంధిత అధికారులకు పంపిస్తాయి. ఈ ఐదు జిల్లాల్లో అక్టోబర్ 31 నాటికి కెమెరాల ఏర్పాటు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# ఇటలీ ఎయిర్‌పోర్ట్‌లో ఘోరం..

## విమానం ఇంజిన్‌లో చిక్కుకుని వ్యక్తి దుర్మరణం

* **మిలాన్ బెర్గామో విమానాశ్రయంలో విషాద ఘటన**
* **భద్రతను దాటుకుని రన్‌వేపైకి వెళ్లిన ఓ వ్యక్తి**
* **ఎయిర్‌బస్ ఏ319 ఇంజిన్‌లో చిక్కుకుని అక్కడికక్కడే మృతి**
* **ఘటనతో గంటల పాటు నిలిచిన విమాన సర్వీసులు**
* **ఆత్మహత్యా, మరేదైనా కారణమా అనే కోణంలో దర్యాప్తు**



ఇటలీలోని మిలాన్ బెర్గామో విమానాశ్రయంలో విషాదకర సంఘటన చోటు చేసుకుంది. విమానాశ్రయ భద్రతా వలయాన్ని దాటుకొని రన్‌వేపైకి ప్రవేశించిన ఒక వ్యక్తి, అక్కడ సిద్ధంగా ఉన్న విమానం ఇంజిన్‌లో చిక్కుకుని మరణించాడు. ఈ ఘటన మంగళవారం జరగగా, స్థానికంగా కలకలం రేపింది. విమానాశ్రయ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, సుమారు 35 సంవత్సరాల వయస్సు గల ఒక వ్యక్తి తన వాహనాన్ని విమానాశ్రయం వెలుపల వదిలి లోపలికి ప్రవేశించాడు. భద్రతా సిబ్బంది కళ్లు గప్పి, విమానాల పార్కింగ్ జోన్‌కు వెళ్లే అత్యవసర ద్వారాన్ని బలవంతంగా తెరిచి రన్‌వే వైపు పరుగెత్తాడు. అదే సమయంలో టేకాఫ్‌కు సిద్ధమవుతున్న ఎయిర్‌బస్ ఏ319 విమానం సమీపానికి చేరుకున్నాడు. వేగంగా తిరుగుతున్న ఇంజిన్ అతడిని బలంగా లోపలికి లాగడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే ఇంజిన్‌ను ఆపివేసి మృతదేహాన్ని వెలికి తీశారు. ఈ దుర్ఘటన కారణంగా విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు కొద్ది గంటలపాటు అంతరాయం కలిగింది. మృతుడు ఆత్మహత్య చేసుకునేందుకే ఈ చర్యకు పాల్పడ్డాడా, లేక దీని వెనుక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు అని అధికారులు తెలిపారు.

# అమెరికాలో మరోసారి తుపాకుల మోత... ముగ్గురి మృతి

* **అమెరికాలోని ఫిలడెల్ఫియాలో కాల్పుల ఘటన**
* **ఓ వీధిలో జరిగిన కాల్పుల్లో ముగ్గురు మృతి**
* **పది మందికి పైగా తీవ్ర గాయాలు, ఒకరి పరిస్థితి విషమం**
* **మృతులు, క్షతగాత్రుల్లో టీనేజర్లు కూడా**
* **సీసీ కెమెరాలో రికార్డయిన కాల్పుల దృశ్యాలు**



అమెరికాలో మరోసారి తుపాకుల మోత మోగింది. ఫిలడెల్ఫియాలోని గ్రేస్ ఫెర్రీ ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన భారీ కాల్పుల ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, మరో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, సౌత్ ఎటింగ్ స్ట్రీట్ లో కొందరు వ్యక్తులు ఓ వీధిలో గుమిగూడారు. ఆ సమయంలో పలువురు దుండగులు ఒక్కసారిగా తుపాకులు బయటకు తీసి విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ భయానక దృశ్యాలు అక్కడే ఉన్న ఓ సీసీ టీవీ కెమెరాలో రికార్డయ్యాయి. ఈ వీడియో ప్రస్తుతం ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది. ఈ ఘటనలో జాసన్ రీస్ (19), జహీర్ వైలీ (23), అజిర్ హారిస్ (24) అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన వారిలో 15 ఏళ్ల బాలిక, ఇద్దరు 17 ఏళ్ల బాలురు కూడా ఉన్నారు. గాయపడిన వారిలో 19 ఏళ్ల యువకుడి పరిస్థితి విషమంగా ఉందని, మిగతా వారు కోలుకుంటున్నారని అధికారులు తెలిపారు. కాల్పుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో మరో వ్యక్తికి కూడా గాయాలయ్యాయి. ఘటనపై ఫిలడెల్ఫియా పోలీస్ కమిషనర్ కెవిన్ బెథెల్ తీవ్రంగా స్పందించారు. “ఇది పిరికిపందల చర్య. అక్కడున్న ఇళ్లు, కార్లపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. తామేదో గూండాలమనుకునే వాళ్లు చేసే నీచమైన పని ఇది” అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటన జరిగిన సమయంలో పోలీసులు సమీపంలోనే ఉన్నారని, కాల్పుల శబ్దం విని వెంటనే అక్కడికి చేరుకున్నారని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పలువురు అనుమానితుల ఫొటోలను విడుదల చేసిన పోలీసులు, నిందితుల సమాచారం తెలిస్తే తెలియజేయాలని ప్రజలను కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# మహిళలపై మాట జారిన నేతపై

# మద్రాస్ హైకోర్టు తీవ్ర ఆగ్రహం

మహిళలను కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేసి వివాదంలో చిక్కుకున్న డీఎంకే నేత, మాజీ మంత్రి కె.పొన్ముడిపై మద్రాస్ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విషయంలో తమిళనాడు పోలీసులు సరిగ్గా స్పందించకపోతే, కేసును సీబీఐకి అప్పగించాల్సి వస్తుందని మంగళవారం జరిగిన విచారణ సందర్భంగా హెచ్చరించింది. రాజకీయ నాయకుల మాటతీరుపై న్యాయస్థానం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. “రాజ్యాంగంలోని ఆర్టికల్ 19ని అడ్డుపెట్టుకుని రాజకీయ నేతలు అడ్డూ అదుపూ లేకుండా మాట్లాడుతున్నారు. చేతికి మైక్ దొరకగానే తామే రాజులన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఈ దేశం కేవలం రాజకీయ నాయకులది మాత్రమే కాదు. తాము కూడా అందరిలాగే మనుషుల మధ్యే బతుకుతున్నామన్న విషయాన్ని వారు గుర్తుంచుకోవాలి. ఇలాంటి వ్యాఖ్యలను మేం చూస్తూ ఊరుకోలేం” అని కోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ కేసులో తదుపరి విచారణను ఆగస్టు 1వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు ప్రకటించింది. గతంలో చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో పొన్ముడి మాట్లాడుతూ, ఓ సెక్స్ వర్కర్, కస్టమర్ మధ్య సంభాషణను ఉదహరిస్తూ అసభ్యకర పదజాలాన్ని ఉపయోగించారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో దుమారం రేగింది. ఆయన వ్యాఖ్యలు మహిళల గౌరవానికి భంగం కలిగించేలా ఉన్నాయని డీఎంకే ఎంపీ కనిమొళి, గాయని చిన్మయి, నటి ఖుష్బూ సహా పలువురు ప్రముఖులు తీవ్రంగా ఖండించారు.

# దానధర్మాల ఫలితం... టాప్10 కుబేరుల జాబితా నుంచి బిల్ గేట్స్ అవుట్!

ప్రపంచ కుబేరుల జాబితాలో దశాబ్దాలుగా అగ్రస్థానాల్లో కొనసాగిన మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్, ఇప్పుడు టాప్10 జాబితాలో స్థానం కోల్పోయారు. ఆయన చేసిన భారీ దానధర్మాల కారణంగా సంపద గణనలో జరిగిన మార్పులతో ఈ పరిణామం చోటుచేసుకుంది. మరింత ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఒకప్పుడు ఆయన వద్ద సహాయకుడిగా పనిచేసి, ఆ తర్వాత మైక్రోసాఫ్ట్ సీఈవోగా బాధ్యతలు చేపట్టిన స్టీవ్ బామర్, ఇప్పుడు సంపదలో గేట్స్‌ను అధిగమించడం విశేషం.ప్రఖ్యాత బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ తాజాగా వెల్లడించిన వివరాల ప్రకారం, బిల్ గేట్స్ సంపద విలువను పునఃసమీక్షించారు. ఆయన చారిటీకి ఇస్తున్న ప్రాధాన్యత, గేట్స్ ఫౌండేషన్‌కు అందిస్తున్న భారీ విరాళాలను పరిగణనలోకి తీసుకుని ఈ లెక్కింపు చేపట్టారు. ఈ సమీక్షలో భాగంగా గేట్స్ సంపద విలువ ఏకంగా 52 బిలియన్ డాలర్లు (దాదాపు 30 శాతం) తగ్గింది. దీంతో ఆయన నికర సంపద 175 బిలియన్ డాలర్ల నుంచి 124 బిలియన్ డాలర్లకు పడిపోయింది. ఫలితంగా, ప్రపంచ కుబేరుల జాబితాలో 5వ స్థానంలో ఉన్న ఆయన, ఏకంగా 12వ స్థానానికి పడిపోయారు. ఇదే సమయంలో 172 బిలియన్ డాలర్ల సంపదతో స్టీవ్ బామర్ 5వ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. గేట్స్ ఇప్పుడు గూగుల్ సహ వ్యవస్థాపకులు లారీ పేజ్, సెర్గీ బ్రిన్, ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్, తన చిరకాల మిత్రుడు వారెన్ బఫెట్ కంటే కూడా వెనకబడిపోయారు. మే నెలలో తన బ్లాగ్‌లో రాసిన ఒక పోస్ట్‌లో బిల్ గేట్స్ తన సంపద, దాతృత్వం గురించి స్వయంగా వివరించారు. తన నికర సంపద 108 బిలియన్ డాలర్లు అని పేర్కొంటూ, రాబోయే రెండు దశాబ్దాలలో తన సంపదలో దాదాపు మొత్తాన్ని గేట్స్ ఫౌండేషన్ ద్వారా విరాళంగా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. 2045 నాటికి ఫౌండేషన్ కార్యకలాపాలు ముగిసేలోపు సుమారు 200 బిలియన్ డాలర్లకు పైగా ఖర్చు చేస్తుందని ఆయన అంచనా వేశారు.

# సీఎం రాకున్నా పర్లేదు, మంత్రులైనా చర్చకు రావాలని కేటీఆర్ డిమాండ్

* రైతు సంక్షేమంపై చర్చకు సిద్ధమంటూ ప్రెస్ క్లబ్‌కు కేటీఆర్
* ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చడం లేదని విమర్శ
* అసెంబ్లీలో మైక్ ఇస్తే అక్కడే మాట్లాడతామన్న కేటీఆర్



రైతు సంక్షేమంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌ను స్వీకరించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చెప్పినట్టుగానే చర్చ కోసం మంగళవారం సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌కు చేరుకున్నారు. పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో కలిసి తెలంగాణ భవన్ నుంచి ఆయన ప్రెస్ క్లబ్‌కు బయల్దేరడంతో హైదరాబాద్ రాజకీయాల్లో వేడి రాజుకుంది. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత పాలన సాగిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను వంచిస్తోందని అన్నారు. రైతు రుణమాఫీ, బోనస్ వంటి కీలక అంశాలపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, అభివృద్ధిపై చర్చకు రావాలని సీఎంను ఎన్నోసార్లు ఆహ్వానించామని గుర్తుచేశారు. "అసెంబ్లీలో చర్చిద్దామంటే మాకు మైకు ఇవ్వరు. కనీసం ప్రెస్ క్లబ్‌లోనైనా చర్చకు రావాలి" అని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలో ఉన్నారని తనకు తెలిసిందని, ఆయన హాజరుకాలేకపోతే మంత్రులనైనా చర్చకు పంపాలని కేటీఆర్ సూచించారు. సీఎంకు వీలైన మరో తేదీ, ప్రదేశం చెప్పినా తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. అసెంబ్లీలో తమ మైక్ కట్ చేయకుండా మాట్లాడే అవకాశం ఇస్తే అక్కడే చర్చించడానికి కూడా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన తెలిపారు.

## భద్రాచలం ఆలయ ఈవోపై దాడి.. కబ్జాదారులకు మంత్రి కొండా సురేఖ గట్టి హెచ్చరిక

* భద్రాచలం ఈవో రమాదేవిపై దాడి ఘటనపై మంత్రి కొండా సురేఖ ఆగ్రహం
* దేవాలయ భూములు కబ్జా చేస్తే పీడీ యాక్ట్ పెడతామని స్ట్రాంగ్ వార్నింగ్
* ఏపీలోని పురుషోత్తపట్నంలో భూ ఆక్రమణలను అడ్డుకున్న ఈవో
* గ్రామస్థుల దాడిలో స్పృహ కోల్పోయిన ఈవో రమాదేవి
* విషయంలో జోక్యం చేసుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబుకు మంత్రి విజ్ఞప్తి
* భద్రాచలం ఆసుపత్రిలో ఈవోకు కొనసాగుతున్న చికిత్స



భద్రాచలం రామాలయం ఈవో రమాదేవిపై జరిగిన దాడి ఘటనపై తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్రంగా స్పందించారు. దేవాలయ భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈవోలపై దాడులు చేయడం సరికాదని, ఇలాంటివి పునరావృతమైతే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని పురుషోత్తపట్నంలో ఉన్న భద్రాచలం దేవాలయ భూముల్లో జరుగుతున్న ఆక్రమణలను అడ్డుకునేందుకు ఈవో రమాదేవి మంగళవారం తన సిబ్బందితో కలిసి వెళ్లారు. ఈ క్రమంలో అక్కడి గ్రామస్థులు కొందరు ఆమెపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో తీవ్ర అస్వస్థతకు గురైన ఆమె స్పృహతప్పి పడిపోయారు. వెంటనే సిబ్బంది ఆమెను భద్రాచలంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె అక్కడే చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన రెండు రాష్ట్రాల మధ్య సున్నితమైన అంశం కావడంతో, మంత్రి కొండా సురేఖ వెంటనే స్పందించారు. ఈ సమస్య పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ చూపాలని ఆమె విజ్ఞప్తి చేశారు. దశాబ్దాలుగా ఉన్న ఈ భూముల వివాదాన్ని పరిష్కరించి, ఆలయ ఆస్తులను కాపాడాలని కోరారు.

## హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టుకు బాంబు బెదిరింపు

* హైదరాబాద్ పాతబస్తీలోని సిటీ సివిల్ కోర్టుకు బాంబు బెదిరింపు
* కోర్టులో బాంబు పెట్టామంటూ ఆగంతకుడి ఫోన్ కాల్
* రంగంలోకి దిగిన బాంబ్, డాగ్ స్క్వాడ్‌లు







హైదరాబాద్ పాతబస్తీలోని సిటీ సివిల్ కోర్టు ప్రాంగణంలో మంగళవారం తీవ్ర కలకలం రేగింది. కోర్టులో బాంబు పెట్టినట్లు ఓ ఆగంతకుడు ఫోన్ చేసి బెదిరించడంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ బెదిరింపుతో అప్రమత్తమైన అధికారులు వెంటనే కోర్టు కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేశారు. వివరాల్లోకి వెళితే, గుర్తుతెలియని వ్యక్తి కోర్టుకు ఫోన్ చేసి, ఆవరణలో బాంబు అమర్చినట్లు హెచ్చరించాడు. ఈ సమాచారం అందుకున్న కోర్టు సిబ్బంది తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుటాహుటిన రంగంలోకి దిగిన పోలీసులు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో కోర్టుకు చేరుకున్నారు. ముందుజాగ్రత్త చర్యగా కోర్టు ప్రాంగణాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్న పోలీసులు, లోపల ఉన్నవారందరినీ బయటకు పంపించివేశారు. అనంతరం బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో ప్రతి అంగుళాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఈ ఘటనతో కోర్టు వద్ద కాసేపు గందరగోళం నెలకొంది.

## అయ్యా కేటీఆర్, నీ చెల్లి నీ మీద మన్ను పోస్తోంది.. నాతో పెట్టుకుంటే నాశనమవుతావు

* తనను కేటీఆర్ టార్గెట్ చేస్తున్నారన్న సీతక్క
* ములుగు అభివృద్ధి చూసి బీఆర్ఎస్ నేతల అసూయ
* ఓర్వలేకే నాపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారు
* బీఆర్ఎస్ నేతలది కక్ష సాధింపు రాజకీయమే
* పదేళ్ల పాలనలో ఎన్నో ఆత్మహత్యలకు వారే కారణమని ఆరోపణ



"అయ్యా కేటీఆర్, మీ చెల్లి ఎలాగూ మీ మీద మన్ను పోస్తోంది. నాతో పెట్టుకుంటే మీరు నాశనం అవుతారు. ఇంతకంటే నేను ఏమీ అనలేను. నాతో పెట్టుకుంటే మీరేం బాగుపడరు. నేను శాపనార్థాలు పెట్టగలను, అంతే. మీలాగా కులబలం, ధనబలం, అహంకారం నాకు లేవు. నేను ఒంటరిదాన్ని. నా ఒక్కగానొక్క అన్న కూడా ఉద్యమంలో చనిపోయాడు. నా నియోజకవర్గమే నాకు అండ. నా ములుగు ప్రజల దీవెనలతో నేను మంత్రిని అయ్యాను. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి సహకారంతో నేను మంత్రిని అయ్యాను" అని అన్నారు. బీఆర్ఎస్ నేతలు తనపై కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేకించి బీఆర్ఎస్ నేత కేటీఆర్ తనను వ్యక్తిగతంగా లక్ష్యం చేసుకుని మాట్లాడుతున్నారని ఆమె విమర్శించారు. ములుగు నియోజకవర్గంలో తమ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి బీఆర్ఎస్ నాయకులు తట్టుకోలేకపోతున్నారని, అందుకే నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి ఎంతోమంది ఆత్మహత్యలకు కారణమైన వారు, ఇప్పుడు తనపై కక్ష సాధింపు చర్యలకు దిగడం ఎంతమాత్రం సరికాదని సీతక్క హితవు పలికారు. కేవలం రాజకీయ ఉద్దేశంతోనే తనపై, ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆమె స్పష్టం చేశారు.




## కొడాలి నాని, జోగి రమేశ్, వంశీ తప్పించుకోలేరు

* కొడాలి నాని, జోగి రమేశ్, వంశీల అవినీతిని బయటపెడతామని కొల్లు రవీంద్ర హెచ్చరిక
* ఏపీ లిక్కర్ స్కామ్‌పై తీవ్ర ఆరోపణలు
* ఇది ప్రపంచంలోనే అతిపెద్ద కుంభకోణం అని వ్యాఖ్య

గత ప్రభుత్వంలో కృష్ణా జిల్లాను సర్వనాశనం చేసి, వేల కోట్ల అవినీతికి పాల్పడ్డ మాజీ మంత్రులు కొడాలి నాని, జోగి రమేశ్, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీలను వదిలిపెట్టే ప్రసక్తే లేదని, వారి అవినీతి బాగోతాలను త్వరలోనే ఆధారాలతో సహా బయటపెట్టి, దోచుకున్న సొమ్మంతా కక్కిస్తామని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం ప్రపంచంలోనే అతిపెద్ద స్కామ్ అని, దాని పుట్టను కదిపితే అందరి బండారం బయటపడుతుందని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం కృష్ణా జిల్లా నాగాయలంక మండలం సోర్లగోంది గ్రామంలో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "గత ఐదేళ్లలో వైసీపీ నాయకులు రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి, ప్రజల సంపదను దోచుకున్నారు. ముఖ్యంగా కృష్ణా జిల్లాను కొడాలి నాని, జోగి రమేశ్, వల్లభనేని వంశీ ముఠా ఇసుక, మద్యం, మట్టి మాఫియాలతో సర్వనాశనం చేశారు. వారి అవినీతి చిట్టాను ఆధారాలతో సహా సిద్ధం చేస్తున్నాం. త్వరలోనే ప్రజల ముందుంచి, వారి నుంచి ప్రతి పైసా కక్కిస్తాం" అని హెచ్చరించారు. "వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్ ప్రపంచంలోనే అతిపెద్ద కుంభకోణం. ఇప్పుడు చీమల పుట్ట కదిలింది, అందరి పేర్లు ఒక్కొక్కటిగా బయటకొస్తాయి" అని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను చూసి ఓర్వలేక కొందరు ప్రజల్లో అలజడులు సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నారని, వారి ఆటలు సాగవని అన్నారు. గాడి తప్పిన పాలనను తాము నెల రోజుల్లోనే సరిదిద్దామని, ఒకటో తేదీనే జీతాలు, పింఛన్లు అందించి సుపరిపాలనకు శ్రీకారం చుట్టామని తెలిపారు.

## మా అనుభవం ముందు కేటీఆర్ ఒక జీరో.. చిన్నపిల్లాడిలా మాట్లాడుతున్నారు: జగ్గారెడ్డి

* మా రాజకీయ అనుభవం ముందు కేటీఆర్ జీరో
* ముఖ్యమంత్రి రేవంత్‌తో చర్చించే స్థాయి కేటీఆర్‌కు లేదు
* కేటీఆర్ సర్పంచ్‌గానైనా గెలిచారా అని ప్రశ్న
* పదవి పోగానే కేటీఆర్ అల్లాడిపోతున్నారని వ్యాఖ్యలు
* గాడిదలు లాంటి మాటలంటే సహించేది లేదని హెచ్చరిక
* కేటీఆర్ విమర్శలు ఆపితే మేమూ ఆపేస్తామన్న జగ్గారెడ్డి



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. తమ సుదీర్ఘ రాజకీయ అనుభవం ముందు కేటీఆర్ ఒక జీరో అని, ఆయన ఒక చిన్న పిల్లాడిలా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని చర్చకు పిలిచే స్థాయి కేటీఆర్‌కు లేదని అన్నారు. మంగళవారం నాడు గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన జగ్గారెడ్డి, కేటీఆర్ రాజకీయ ప్రస్థానాన్ని ప్రశ్నించారు. "మేమంతా ఎన్నో వ్యయప్రయాసలకోర్చి క్షేత్రస్థాయి నుంచి నాయకులుగా ఎదిగాం. కేటీఆర్ తన తండ్రి సీటిస్తే నేరుగా ఎమ్మెల్యే అయ్యారు. ఆయనెప్పుడైనా సర్పంచ్‌గా గెలిచారా? జడ్పీటీసీగా గెలిచారా? రాజకీయాల్లోని కష్టనష్టాలు, ఒడిదుడుకులు ఆయనకు ఎలా తెలుస్తాయి?" అని జగ్గారెడ్డి నిలదీశారు. కేటీఆర్ నోరు తెరిస్తే అబద్ధాలు చెబుతున్నారని, కాంగ్రెస్ నేతలను "గాడిదలు" అంటూ విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. "మీరు మమ్మల్ని ఒక మాట అంటే మేము పది మాటలు అంటాం. మీరు ముఖ్యమంత్రిని దూషించడం ఆపేస్తే, మేము కూడా ప్రతి విమర్శలు ఆపేస్తాం" అని స్పష్టం చేశారు. 18 నెలలు అధికారం లేకపోయేసరికి కేటీఆర్ గట్టున పడ్డ చేపలా కొట్టుకుంటున్నారని జగ్గారెడ్డి విమర్శించారు. సోదరి కవిత అరెస్టు వ్యవహారంతో ఆయన తీవ్ర ఒత్తిడిలో ఉన్నారని, అందుకే తరచూ విదేశీ పర్యటనలకు వెళుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌ను విమర్శించే ముందు కేటీఆర్ బాగా అధ్యయనం చేయాలని సూచించారు.

## 'బీసీ' బిల్లు ఆమోదించకపోతే రైల్‌రోకో : ఎమ్మెల్సీ కవిత

ఢిల్లీ: బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు ఇవ్వాలని భారత రాష్ట్రసమితి ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఆమె మీడియాతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ఆమోదించకపోతే జులై 17న రైల్‌రోకో చేస్తామని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లు సాధించేవరకు పోరాడతామని చెప్పారు. రైల్‌రోకోకు మద్దతు కోరుతూ బుధవారం అన్ని పార్టీలకు లేఖ రాస్తామని తెలిపారు.




## బోనాల జాతర శాంతియుతంగా జరిగేలా చర్యలు తీసుకోండి

హైదరాబాద్: ఆషాఢ మాస బోనాల జాతర ఉత్సవాలు శాంతియుతంగా కొనసాగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ అంబర్‌పేట్‌లో బోనాల జాతర ఉత్సవాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. పోలీసు, రెవెన్యూ, దేవాదాయశాఖ, జీహెచ్ఎంసీ, అగ్నిమాపక, విద్యుత్తు, జలమండలి ఇతర విభాగాల అధికారులు ఒక ప్రణాళికతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. అంబర్‌పేట్‌లో నూతనంగా నిర్మించిన ఫ్లై ఓవర్, సర్వీస్ రోడ్లపై ఏర్పడిన గుంతలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబం zధిత అధికారులను ఆదేశించారు. జంట నగరాల్లో జరిగే బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం తరఫున మంత్రులు పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. దొంగతనాలు, శానిటైజేషన్, మహిళల భద్రత కోసం ప్రత్యేక బృందాల ఏర్పాటుకు మంత్రి ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నేత వి హనుమంతరావు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, పోలీసు ఉన్నతాధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



# స్వల్ప లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

## 270 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం లాభాల్లో ముగిశాయి. యూఎస్ సుంకాల ఉద్రిక్తతలు సెంటిమెంట్‌పై ప్రభావం చూపడంతో మార్కెట్లు నిదానంగా కదలాడాయి. భారత్-యూఎస్ వాణిజ్య చర్చలు నిలిచిన నేపథ్యంలో పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించారు. మార్కెట్లు ఉదయం నష్టాల్లో మొదలైనా.. చివరి సెషన్‌లో కోలుకోవడంతో లాభాల్లో ముగిశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 83,387.03 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 83,320.95 పాయింట్ల కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. గరిష్టంగా 83,812.31 పాయింట్లకు పెరిగింది.

చివరకు 270.01 పాయింట్ల లాభంతో 83,712.51 వద్ద స్థిరపడింది. మరో వైపు నిఫ్టీ సైతం 61.20 పెరిగి 25,522.50 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 1,889 షేర్లు లాభాల్లో కొనసాగగా.. 1,990 షేర్లు నష్టాల్లో ముగిశాయి. విస్తృత మార్కెట్లు స్వల్పంగా నష్టపోయాయి. ప్రైవేట్ బ్యాంకింగ్ స్టాక్‌ల లాభాలతో బ్యాంక్ నిఫ్టీ ఇండెక్స్ దాదాపు 60 బేసిస్ పాయింట్లు లాభపడింది. ఐటీ, రియాలిటీ, మీడియా సూచీలు లాభాలను నమోదు చేశాయి. మరోవైపు, ఫార్మా, పబ్లిక్ బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ స్టాకులు పడిపోయాయి.

# త్వరలో అమెరికాతో భారత్‌తో వాణిజ్య ఒప్పందం

## కీలక సూచనలు చేసిన జీటీఆర్ఐ




**న్యూఢిల్లీ:** త్వరలోనే అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందాన్ని చేసుకోనున్నది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలు దేశాలకు సుంకాలను లేఖలు రాస్తున్నారు. అయితే, ఈ ఒప్పందాన్ని ఖరారు చేసే ప్రక్రియలో భారత్ జాగ్రత్తగా ముందుకు సాగాలని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ ఈ వ్యాఖ్యలు చేసింది. ట్రంప్ మోడల్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కాదని.. ఇది అమెరికా సుంకాల ప్రతీకార ఒప్పందంగా పేర్కొంది. అమెరికా వివిధ దేశాలతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలను ఖరారు చేసేందుకు జులై 9తో ముగిసిన గడువును ఆగస్టు ఒకటి వరకు గడువును పొడిగించింది. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం భారత్‌తో సహా ఇతర దేశాలు ఒప్పందం కుదుర్చుకోవడానికి మరో మూడు వారాల సమయం ఉన్నది. ఇప్పటివరకు బ్రిటన్, వియత్నాం మాత్రమే అమెరికాతో వాణిజ్య ఒప్పందాలను ఖరారు చేసుకున్నది.

చైనాతో కూడా తాత్కాలిక ఒప్పందం కుదిరింది. ప్రస్తుతం ట్రంప్ ఒత్తిడిని పెంచుతున్నది. ఒప్పందం కుదుర్చుకోలేకపోతే ఆగస్టు ఒకటి అమెరికా దిగుమతులకు అడ్డంకులు తొలగించాలంటూ ట్రంప్ మరోసారి వాణిజ్య యుద్ధానికి దిగారు. అమెరికాలో తయారీని పెంచాలని.. ఈ ఒప్పందానికి అంగీకరించకపోతే భారీ సుంకాలు తప్పవంటూ 14 దేశాలకు లేఖ రాశారు. అమెరికా దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై 25 శాతం నుంచి 40 శాతం వరకు సుంకాలు తప్పవని హెచ్చరించారు. వాణిజ్య డిమాండ్స్‌కు అంగీకరించని దేశాలపై ఆగస్టు ఒకటి నుంచి సుంకాలు తప్పవని స్పష్టం చేశారు. ట్రంప్ ఆయా ఎదుర్కొనే సుంకాలను వివరిస్తూ 14 దేశాలకు అధికారిక లేఖలపై సంతకం చేసినట్లు జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. జపాన్, దక్షిణ కొరియా, కజకిస్తాన్, మలేషియా, ట్యునీషియాపై 25 శాతం, దక్షిణాఫ్రికా, బోస్నియా, హెర్జెగోవినాపై 30 శాతం, ఇండోనేషియాపై 32 శాతం, బంగ్లాదేశ్, సెర్బియాపై 35 శాతం, కంబోడియా, థాయిలాండ్‌పై 36 శాతం, లావోస్, మయన్మార్‌పై 40 శాతం సుంకాలను ప్రకటించింది.

అయితే, వైట్‌హౌస్ 'ఫైనల్ నోటీసు'గా హెచ్చరించిందని శ్రీవాస్తవ తెలిపారు. యూఎస్ నిబంధనలపై ఒప్పందంపై సంతకం చేయండి.. లేకపోతే ప్రతీకార సుంకాలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరిస్తుందని.. దీంతో యూఎస్‌లో వినియోగదారుల ధరలను పెంచే అవకాశం ఉందని, ప్రపంచ సరఫరా గొలుసులలో విస్తృతమైన సమస్యలను సృష్టించే అవకాశం ఉందని ఆయన తెలిపారు. మునుపటి కాలంతో పోలిస్తే మే 2025లో చైనా నుంచి యూఎస్ దిగుమతులు 35 శాతం తగ్గాయి. అయితే, న్యూఢిల్లీ ఒప్పందంపై జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఉన్న రాయితీలు, సరకుల రవాణా విషయంలో నెలకొన్న అస్పష్టమైన నిబంధనలు, అన్నింటిపైనా ఒకే రేటుతో కూడిన పన్ను.. తదితర దీర్ఘకాలంలో వాణిజ్య స్థిరత్వానికి ప్రమాదాన్ని గురించి, లోటుపాట్లను పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని జీఆర్‌టీఐ సూచించింది.

# మళ్లీ పెరుగుతున్న బంగారం..



**న్యూఢిల్లీ:** పసిడి కొనుగోలుదారులకు షాక్ ఇచ్చింది. నిన్న స్వల్పంగా దిగి వచ్చిన ధర తాజాగా పెరిగింది. స్టాకిస్టులు కొనుగోళ్లకు దిగడంతో బంగారానికి డిమాండ్ పెరిగింది. దేశ రాజధాని ఢిల్లీ నగరంలో 24 క్యారెట్ల బంగారంపై రూ.550 పెరిగి తులం రూ.99,120కి చేరుకుందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ.500 పెరిగి తులానికి రూ.98,600కి చేరింది. మరో వైపు వెండి ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. వరుసగా మూడో సెషన్‌లోనూ ధర స్థిరంగా ఉన్నది. కిలోకు రూ.1,04,800 పలుకుతున్నది. అదే సమయంలో అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు 11.42 డాలర్లు పెరిగి 3,325.09 డాలర్లకు ఎగిసింది. సోమవారం నాటి పతనం నుంచి పసడి కోలుకుందని బులియన్ మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు.

మళ్లీ వాణిజ్య యుద్ధం మొదలవనున్నదనే భయాందోళనలు పెరిగాయి. ఆగస్టు ఒకటి నుంచి వచ్చే అములోకి వచ్చే.. జపాన్, దక్షిణ కొరియా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై 25శాతం సుంకం విధించాలని ట్రంప్ ఆదేశించిన నేపథ్యంలో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ విశ్లేషకులు (కమోడిటీస్) సౌమిల్ గాంధీ మాట్లాడుతూ.. ట్రంప్ నిర్ణయాలు అమెరికా వాణిజ్య విధానాలను సంస్కరించడానికి ఆయన చూపుతున్న చొరవను ప్రతిబింబిస్తున్నాయన్నారు. సుంకాల వివాదం మార్కెట్‌లో అనిశ్చితిని సృష్టించిందని పేర్కొన్నారు. దాంతో పెట్టుబడులకు సురక్షితంగా భావించే బంగారానికి అనుకూలమైన వాతావరణం నెలకొంటుందన్నారు. పెట్టుబడిదారులు యూఎస్ సుంకాలతో పాటు ఫెడ్ రిజర్వ్ వ్యాఖ్యలు, తాజా ద్రవ్యోల్బణం డేటాను నిశితంగా పరిశీలిస్తున్నారని.. ఇవన్నీ రాబోయే కాలంలో బంగారం ధరలను ప్రభావితం చేస్తాయని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చింతన్ మెహతా తెలిపారు.

ఏంజెల్ వన్‌లోని కమోడిటీస్ అండ్ కరెన్సీస్ సీనియర్ టెక్నికల్ అనలిస్ట్ తేజస్ షిగ్రేకర్ మాట్లాడుతూ.. బలహీనమైన యూఎస్ ఆర్థిక డేటా, పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణంతో మార్కెట్ ఇబ్బందిపడుతుందన్నారు. జూన్ నుంచి డాలర్ బలహీనపడిందని.. వినియోగదారులను బంగారం ఆకర్షిస్తుందని షిగ్రేకర్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా హైదరాబాద్‌లోని బంగారం ధరలను పరిశీలిస్తే.. 22 క్యారెట్ల పసిడి రూ.90,600 ఉండగా.. 24 క్యారెట్ల బంగారం ధర రూ.98,840 పలుకుతున్నది. ఇక వెండి ధర రూ.1,19,900 వద్ద ట్రేడవుతున్నది.




# మూడో ర్యాంక్ కొల్లగొట్టిన మంధాన..

## రెండో స్థానానికి ఎగబాకిన దీప్తి

న్యూఢిల్లీ: భారత మహిళల జట్టు ఆల్‌రౌండర్ దీప్తి శర్మ ఐసీసీ ర్యాంకింగ్స్‌లో అదరగొట్టింది. ఇంగ్లండ్ పర్యటనలో తిప్పేస్తున్న ఆమె టీ20 బౌలర్ల ర్యాంకిగ్స్‌లో రెండో స్థానానికి దూసుకెళ్లింది. గత ఆరేళ్లుగా టాప్ -10లో ఉంటున్న దీప్తి.. ఒక ర్యాంక్ ఎగబాకి టాప్ 2గా నిలిచింది. అగ్రస్థానంలో ఉన్న పాకిస్థాన్ సదియా ఇక్బాల్‌కు, దీప్తికి 8 పాయింట్ల తేడానే ఉంది. టీమిండియా విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఈ ఆల్‌రౌండర్‌కు కెరీర్లో ఇదే అత్యుత్తమ ర్యాంక్ కావడం విశేషం. పేసర్ రేణుకా సింగ్ 6లో, రాధా యాదవ్ 18లో, తెలుగమ్మాయి అరుంధతి రెడ్డి 11 స్థానాలు మెరుగుపరచుకొని 43వ ర్యాంక్‌లో కొనసాగుతున్నారు.

గత కొంత కాలంగా అంతర్జాతీయ క్రికెట్‌లో దీప్తి నిలకడగా రాణిస్తోంది. ఈమధ్యే ముక్కోణపు వన్డే సిరీస్ గెలుపొందడంలో ముఖ్య భూమిక ఆమెదే. అనంతరం ఇంగ్లండ్ పర్యటనలో కూడా దీప్తి బ్యాటుతో, బంతితో చెలరేగిపోతోంది. మూడో టీ20లో మూడు వికెట్లు తీసిన భారత స్టార్ టీ20ల్లో తన ర్యాంక్‌ను మెరుగుపరచుకుంది. ఇంగ్లండ్ బౌలర్లలో ఇసీ వాంగ్ 57వ, లారెన్ ఫిలర్ 68వ ర్యాంక్‌లో కొనసాగుతున్నారు.

టాప్ -20లో నలుగురు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత వైస్ కెప్టెన్ స్మృతి మంధాన టాప్ -5లో చోటు దక్కించుకుంది. ఇంగ్లండ్ గడ్డపై పరుగుల వరద పారిస్తున్న మంధాన మూడో ర్యాంక్ కైవసం చేసుకుంది. మిడిలార్డర్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ 12వ స్థానంలో ఉండగా ఈమధ్యే పునరాగమనం చేసిన షఫాలీ వర్మ 13, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 15 వ స్థానంలో ఉన్నారు.

# రూట్ వికెట్‌పై వివాదం..

## నో బాల్ ప్రచారాన్ని తిప్పికొట్టిన ఎంసీసీ



**బర్మింగ్‌హామ్:** బర్మింగ్‌హామ్ టెస్టులో టీమిండియా చిరస్మరణీయ విజయంతో సిరీస్ సమం చేసింది. ఆద్యంతం ఇంగ్లండ్‌పై పైచేయి సాధిస్తూ వచ్చిన టీమిండియాకు ఆకాశ్ దీప్ గెలుపు గుర్రమయ్యాడు. ఇన్‌స్వింగర్‌తో డేంజరస్ జో రూట్‌ను ఆకాశ్ బౌల్డ్ చేయడం మ్యాచ్‌కే హైలైట్. అతడి వికెట్‌తో ఇంగ్లండ్ కోలుకోలేకపోయింది. అయితే.. రూట్ వికెట్‌పై మీడియాలో రాద్ధాంతం మొదలైంది. ఆకాశ్ నో బాల్ వేశాడని, అసలు రూట్ ఔటే కాదనే చర్చ ఊపందుకుంది. ఇంగ్లండ్ మాజీ ఆటగాళ్లు కూడా అవునంటూ గొంతుకలిపారు. సోషల్ మీడియాలో ముదురుతున్న ఈ వివాదంలో అర్థం లేదని పేర్కొన్న మెరిలెబొనే క్రికెట్ క్లబ్ ఆకాశ్ వేసిన బంతి సరైనదేనని స్పష్టం చేసింది.

అసలేం జరిగిందంటే.. ఐదో రోజు తొలి సెషన్ పదో ఓవర్లో ఆకాశ్ సంధించిన రెండో బంతిని అడ్డుకోలేక రూట్ క్లీన్ బౌల్డయ్యాడు. ఇన్‌స్వింగ్ అయిన బాల్ వికెట్లను గిరాటేయడంతో అతడు నిరాశగా పెవిలియన్ చేరాడు. కానీ, ఆ తర్వాత ఫుటేజ్‌లో ఆకాశ్ కాలు క్రీజులోని వెనక గీతకు అవతల ఉన్నట్టు కనిపించింది. దాంతో, అది బ్యాక్ ఫుట్ నో బాల్ అని, అంపైర్ గుర్తించకపోవడం వల్ల రూట్ బలయ్యాడని వార్తలు వైరలయ్యాయి.

ఈ విషయంపై ఎంసీసీ స్పందిస్తూ ఆకాశ్ సరైన బంతినే వేశాడని అంది. 'బర్మింగ్‌హామ్ టెస్టులో రూట్‌ను బౌల్డ్ చేసిన ఆకాశ్ బంతిని సంధించే సమయంలో అతడి బ్యాక్ ఫుట్ అవతలి లైన్ మీదే ఉంది. అతడు బంతిని విసిరేసే క్రమంలో మిగతా పాదం లైన్‌కు కొద్దిగా తాకి ఉంటుంది. అలా అనీ దాన్ని నో బాల్ అనలేం. క్రికెట్ సూత్రాల ప్రకారం చూసినా కూడా అది బ్యాక్‌ఫుట్ నో బాల్ కానే కాదు' అని వెల్లడించింది. రూట్ వికెట్‌పై మీడియాలో వస్తున్న కథనాల భారత మాజీ కోచ్ రవి శాస్త్రి కూడా కొట్టిపారేశాడు. అది కచ్చితంగాది లీగల్ డెలివరే అని తేల్చి పడేశాడు శాస్త్రి. థర్డ్ అంపైర్ పాల్ రీఫెల్ సైతం ఆకాశ్ వేసింది సరైన బంతేనని చెప్పాడు. ఇప్పుడు ఎంసీసీ కూడా వివరణ ఇవ్వడంతో రూట్ వికెట్‌పై నెలకొన్న అనవసర వివాదం సమసిపోయింది.

# వింబుల్డన్‌లో ఒత్తిడి..

## ఇండోపాక్ మ్యాచ్ లాంటిది: విరాట్ కోహ్లీ



**లండన్:** క్రికెట్‌తో పోలిస్తే వింబుల్డన్ సెంటర్ కోర్టులోనే ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని టీమిండియా క్రికెటర్ విరాట్ కోహ్లీ అన్నారు. వింబుల్డన్ టెన్నిస్ టోర్నీలో భాగంగా జరిగిన జకోవిచ్ వర్సెస్ అలెక్స్ డీ మినార్ మ్యాచ్‌ను కోహ్లీ తిలకించాడు. అయితే ఆ సమయంలో మాజీ టెన్నిస్ ప్లేయర్, కామెంటేటర్ విజయ్ అమృత్‌రాజ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కోహ్లీ మాట్లాడారు. కిక్కిరిసిన స్టేడియంలో క్రికెట్ ఆడడం కన్నా.. వింబుల్డన్‌లోని సెంటర్ కోర్టులో టెన్నిస్ మ్యాచ్ ఆడడమే తీవ్ర వత్తిడిని కలిగిస్తుందని కోహ్లీ అభిప్రాయపడ్డాడు. కేవలం ఇండియా, పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్‌లో ఉండే వత్తిడి మాత్రమే వింబుల్డన్ మ్యాచ్‌లతో పోల్చవచ్చు అన్నారు.

ప్రేక్షులతో నిండిపోయిన స్టేడియంలో ఆడడం వత్తిడితో కూడుకున్నదే అని, కానీ వింబుల్డన్ సెంటర్ కోర్టులో ఆడితే ఆ వత్తిడి మరోలా ఉంటుందని కోహ్లీ చెప్పాడు. ఎందుకంటే టెన్నిస్ కోర్టులో ప్రేక్షకులు మరీ దగ్గరగా కూర్చుకుంటారని చెప్పారు. క్రికెట్‌లో మేం బ్యాటింగ్ చేస్తున్నప్పుడు ప్రేక్షకులు చాలా దూరంగా ఉంటారని, వాళ్ల కామెంట్లు మనకు వినబడవు. కేవలం బౌండరీ వద్ద ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు మాత్రమే ప్రేక్షకుల అరుపులు వినిపిస్తాయన్నారు. అక్కడ వ్యక్తిగత స్కిల్‌తో పెద్ద ఆటపై ప్రభావం ఏమీ ఉండదన్నారు.

కానీ టెన్నిస్‌లో మాత్రం టెన్షన్ అంతా లైన్ మీదే ఆధారపడి ఉంటుందని కోహ్లీ అన్నాడు. బేస్ లైన్‌కు కాస్త అటు ఇటు పడినా ఫలితం మరోలా ఉంటుందన్నారు. టెన్నిస్‌లో ఆటగాళ్లకు వత్తిడి ఎక్కువగా ఉంటుందన్నాడు. ఇక సెంటర్ కోర్టులో ఆడే మ్యాచ్‌లకు ఆ ప్రెజర్ మరీ అధికంగా ఉంటుందన్నారు. ఆ అంశంలో టెన్నిస్ ఆటగాళ్ల పట్ల అమితమైన గౌరవం ఉందన్నాడు. వరల్డ్‌కప్‌లోని ఇండోపాక్ మ్యాచ్‌లు, లేదా సెమీస్, ఫైనల్ మ్యాచుల్లో మాత్రమే తీవ్ర వత్తిడి ఉంటుందని, కానీ టెన్నిస్‌లో క్వార్టర్స్ నుంచే ఆ ఫీల్ ఉంటుందన్నారు.

# కెప్టెన్ బ్రంట్ ఫిట్..

# వన్డే స్క్వాడ్‌లో నంబర్ 1 బౌలర్

**లండన్:** స్వదేశంలో భారత మహిళల జట్టుతో జరుగుతున్న టీ20 సిరీస్‌లో వెనకబడిన ఇంగ్లండ్ వన్డే సిరీస్‌పై గురి పెట్టింది. గాయంతో పొట్టి సిరీస్ చివరి మూడు మ్యాచ్‌లకు దూరమైన కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్ కెప్టెన్‌గా కోలుకోవడంతో వన్డే ఫైట్‌కు సిద్ధమవుతోంది ఆతిథ్య జట్టు. భారత జట్టుతో జరుగబోయే మూడు వన్డేల కోసం సెలెక్టర్లు మంగళవారం బలమైన స్క్వాడ్‌ను ప్రకటించారు. 15మందితో కూడిన బృందంలో నంబర్ 1 బౌలర్ ఎకిల్‌స్టోన్, బౌచర్ చోటు దక్కించుకున్నారు.

పొట్టి సిరీస్ తదుపరి మ్యాచ్‌లకు దూరమైన నాట్ సీవర్ బ్రంట్ కోలుకొని ఫిట్‌నెస్ సాధించింది. ఆమె వన్డే సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లు ఆడుతుందని ఆశిస్తున్నాం. టీ20లో భారత జట్టు అద్భుతంగా ఆడి మమ్మల్ని ఓడించింది. ఈ సిరీస్‌లో జట్టుగా మేము చాలా విషయాలు నేర్చుకున్నాం. వన్డే సిరీస్‌లో నిలకడగా ఆడడంపై మేము దృష్టి సారిస్తున్నాం అని ఇంగ్లండ్ కోచ్ చార్లొట్టె ఎడ్వర్డ్స్ వెల్లడించింది.

టీమిండియా, ఇంగ్లండ్‌ల మధ్య మూడు వన్డేల సిరీస్ సౌంథాంప్టన్ వేదికగా జూలై 16న మొదలవ్వనుంది. 19న లార్డ్స్, 22న చెస్టర్ లీ స్ట్రీట్‌లో తదుపరి రెండు మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ రెండు మ్యాచుల్లో జయభేరి మోగించింది. నిర్ణయాత్మక మూడో మ్యాచ్‌లో ఇంగ్లండ్ 5 వికెట్లతో గెలుపొంది సిరీస్‌లో నిలిచింది. నాలుగో టీ20 మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రఫోర్డ్‌లో జూలై 9న, ఐదోది బర్మింగ్‌హామ్‌లో జూలౌ 12న జరుగనుంది.




**ఇంగ్లండ్ వన్డే స్క్వాడ్:** నాట్ సీవర్ బ్రంట్(కెప్టెన్), ఎమ్ అర్లాట్ సోఫియా డంక్లే, ఎమ్మా లాంబ్, టమ్మీ బ్యూమంట్(వికెట్ కీపర్), అమీ జోన్స్(వికెట్ కీపర్), ఎమ్మా క్రాస్, అలిసే డేవిడ్‌సన్ రిచర్డ్స్, చార్లీ డీన్ సోఫీ ఎకిల్‌స్టన్ లారెన్ ఫైలెర్ మియా బౌచియర్, అలిసే క్యాప్సే, కేట్ లిన్సే స్మిత్, లారెన్ బెల్.

## హరిహర వీరమల్లు కోసం
# అభిమానుల ఉత్కంఠ



**టాకీస్:** పవన్ కల్యాణ్ కథానాయకుడిగా రూపొందిన హిస్టారికల్ యాక్షన్ ఫిల్మ్ 'హరి హర వీరమల్లు'. జ్యోతికృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం జులై 24న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఓవర్సీస్‌లో కొన్ని ప్రాంతాల్లో టికెట్ బుకింగ్స్ కూడా ప్రారంభమయ్యాయి. తాజాగా అక్కడ ఓ టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ దీని రన్-టైమ్ 2.40 గంటలుగా పేర్కొంది. దీంతో ఈ రన్‌టైమ్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.

ఈ సినిమాలో పవన్ సరసన నిధి అగర్వాల్ కనిపించనున్న విషయం తెలిసిందే. తాజాగా ఆమె అభిమానులతో చిట్‌చాట్ చేస్తూ.. ఈ సినిమాలో ఏ సన్నివేశం ఎక్కువ ఆసక్తికరంగా ఉంటుందో చెప్పారు. ఇంటర్వెల్, పోస్ట్ ఇంటర్వెల్, -క్లైమాక్స్‌లోని సన్నివేశాలు మరింత ఆసక్తిగా ఉంటాయని వెల్లడించారు. దీని విడుదల కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. 'హరి హర వీరమల్లు' తనకు దేవుడిచ్చిన బహుమానమని అన్నారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఏఎం రత్నం నిర్మించిన ఈ చిత్రంలో వీరమల్లు అనే పోరాటయోధుడి పాత్రలో పవన్ కనిపించనున్నారు. ఈ మూవీ రెండు భాగాలుగా రానుంది. ధర్మం కోసం యుద్ధం అంటూ 'హరి హర వీరమల్లు: స్వోర్డ్ అండ్ స్పిరిట్' పేరుతో మొదటి భాగం సిద్ధమైంది. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చింది.

# 'వార్ 2' షూటింగ్ కంప్లీట్..
## హృతిక్ రోషన్ ఎమోషనల్ పోస్ట్



**టాకీస్:** వార్ 2 సినిమా షూటింగ్ పూర్తయిన సందర్భంగా బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్ సోషల్ మీడియాలో ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. 149 రోజుల పాటు సాగిన ఈ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ, సినిమా కోసం పడిన కష్టాన్ని, చెమటను, గాయాలను గుర్తుచేసుకున్నారు. వార్ 2 షూటింగ్ కంప్లీట్ అయిన నాకు ఏదో తెలియని భావన కలిగింది. 149 రోజుల విరామం లేని పోరాటం, యాక్షన్, డ్యాన్స్, రక్తం, చెమట, గాయాలు ఇదంతా విలువైనదే! తారక్ సర్, మీతో కలిసి పనిచేయడం, మీతో కలిసి ఇంత ప్రత్యేకమైన చిత్రాన్ని రూపొందించడం చాలా గొప్ప గౌరవం. అద్వానీ కియారా, మీలోని ఆ డేంజరస్ సైడ్ చూసేందుకు ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. మీతో స్క్రీన్ షేర్ చేసుకోవడం అద్భుతంగా ఉంది. ఆది, అయాన్ల అద్భుతమైన సినిమాటిక్ విజన్‌ని మీరంతా చూసేందుకు నేను వేచి ఉండలేను. వార్ 2 టీమ్‌కు, నటీనటులకు, సిబ్బందికి.. మీ టాలెంట్‌ని పంచుకున్నందుకు, ప్రతిరోజు మీ శాయశక్తులా కృషి చేసినందుకు ధన్యవాదాలు. చివరగా.. కబీర్ పాత్రకు గుడ్ బై చెప్పడం ఎప్పుడూ కాస్త బాధగానే ఉంటుంది. మళ్లీ నార్మల్ అవ్వడానికి నాకు కొన్ని రోజులు పడుతుంది. ఆగస్టు 14, 2025న వార్ 2 సినిమాను మీ ముందుకు తీసుకురాబోతున్నామంటూ హృతిక్ వెల్లడించారు.

Sai Pallavi

# బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న సాయి పల్లవి



టాకీస్: బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్‌ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ఏక్ దిన్. ఈ సినిమాతో స్టార్ నటి సాయి పల్లవి బాలీవుడ్ ఎంట్రీ- ఇస్తుండగా.. సునీల్ పాండే దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. అయితే ఈ సినిమాను నవంబర్ 7న ప్రేక్షకుల ముందుకు తీసుకురా బోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.ఈ సినిమాను ఆమిర్‌ఖాన్‌తో పాటు- బాలీవుడ్ అగ్ర నిర్మాత మన్సూర్ ఖాన్ నిర్మిస్తున్నాడు. ఆమిర్‌ఖాన్ - మన్సూర్ ఖాన్ దాదాపు 17 ఏండ్ల తర్వాత ఈ సినిమాతో మళ్లీ కలుస్తున్నారు. వీరిద్దరి కలయికలో 2008లో వచ్చిన 'జానే తూ... యా జానే నా' చిత్రం సూపర్ హిట్‌ను అందుకుంది.

# నటి విద్యాబాలన్ ఆరోగ్య సీక్రెట్
## డైట్ ప్లాన్ అనుసరించి బరువు తగ్గా: విద్యాబాలన్

టాకీస్: ప్రతి ఒక్క హీరోయిన్ శరీర ఆకృతి విషయంలో చాలా అంటే చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. అందంగా కనిపించడం కోసం జిమ్‌లో గంటల తరబడి వర్కౌంట్‌లు చేస్తారు. అయితే బరువు తగ్గాలంటే జిమ్, వ్యాయామం, కఠినమైన డైట్‌లు తప్పనిసరి అన్న భావనకు బాలీవుడ్ నటి విద్యా బాలన్ ఓ కొత్త కోణాన్ని చూపించారు. 46 ఏళ్ల విద్యా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశమవుతున్నాయి. కెరీర్ ఆరంభం నుంచి తన శరీర తీరుపై విమర్శలు ఎదుర్కొన్న విద్యా, ఎన్నో డైట్‌లు, జిమ్ సెషన్లు -ట్రై చేసినా అవి తాత్కాలిక ఫలితాలే ఇచ్చాయని గుర్తుచేశారు. కానీ ఆమె అసలు మార్పు మాత్రం జిమ్ మానేశాకే వచ్చిందని వెల్లడించారు. 'నాకు బరువు పెరగడానికి అసలు కారణం కొవ్వు కాదు. అది ఇన్‌ఫ్లమేషన్ (శరీరంలోని వాపు) అని చెన్నైకి చెందిన 'అముర' అనే న్యూట్రిషన్ గ్రూప్ చెప్పారు. ఆ సంస్థ సూచించిన విశిష్టమైన డైట్ ప్లాన్ అనుసరించడంతో, బరువు క్రమంగా తగ్గిపోయింది. అంతేకాదు, ఈ డైట్‌తోపాటు- నన్ను ఏడాది పాటు వ్యాయామం చేయొద్దని సూచించారు. నేను వర్కౌట్ చేయకుండా, జిమ్‌కి కూడా వెళ్లకుండా బరువు తగ్గాను. ఇప్పుడు ఎవరైనా నన్ను చూస్తే.. ఎంత స్లిమ్ అయిపోయావ్ అంటు-న్నారు. నేను పాటించిన డైట్ విధానం అందరికీ సరిపోదు. ఒక్కొక్కరి శరీరం ఒక్కోలా ఉంటుంది. అందుకే శరీర అవసరాలు గౌరవించాలి' అంటూ తన అనుభవాన్ని పంచుకుంది.



# పంచాయత్ 5..
## కొత్త సీజన్ అనౌన్స్‌మెంట్ ఇచ్చిన ప్రైమ్ వీడియో

**టాకీస్:** ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో సూపర్ హిట్ అయిన పాపులర్ వెబ్ సిరీస్ పంచాయత్ తన కొత్త సీజన్‌ను




ప్రకటించింది. ఇప్పటికే గత నెల నాలుగో సీజన్‌ను వదిలిన మేకర్స్ తాజాగా ఐదవ సీజన్ అప్‌డేట్ ఇచ్చారు. ఐదో సీజన్ వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని తెలుపుతూ 'అమెజాన్ ప్రైమ్ వీడియో' కొత్త పోస్టర్‌ను పంచుకుంది. సీజన్4లో ఫులేరా గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సాగగా.. వచ్చే కొత్త ఎలా ఉండబోతుందని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. జితేంద్ర కుమార్, నీనా గుప్తా, రఘుబీర్ యాదవ్ తదితరులు ఇందులో కీలక పాత్రల్లో నటించగా.. దీపక్ కుమార్ మిశ్రా, అక్షత్ సంయుక్తంగా తెరకెక్కించారు.

# రాజమౌళి..మహేశ్ బాబు కాంబో సినిమాపై కనిపించని ప్రచారం

**టాకీస్:** రాజమౌళితో సినిమా చేస్తున్న హీరోలు మధ్యలో మరో ప్రాజెక్ట్ చేయకూడదు. ఇది జక్కన్న మొదటి రూల్. బాహుబలి సమయంలో ప్రభాస్, ఆర్ఆర్ఆర్ సినిమా చేస్తున్నప్పుడు ఎన్టీఆర్, రామ్ చరణ్ మరో సినిమా చేయలేదు. కాకపోతే గెస్ట్ రోల్ అని చెప్పి జక్కన్న దగ్గర స్పెషల్ పర్మిషన్ తీసుకొని ఆచార్య చేశాడు చరణ్. ఇప్పుడు ఎస్ఎస్ఎంబి29 కోసం మహేశ్ బాబు బల్క్ డేట్స్ ఇచ్చేశాడు. ఈ సినిమా తప్పితే మరో సినిమా చేయడం లేదు. అంతే కాకుండా ఈ సినిమాకు సంబంధించి బయట ఒక్క మాట కూడా మాట్లాడడం లేదు మహేశ్ బాబు. కానీ మిగతా స్టార్స్ మాత్రం రాజమౌళి రూల్స్ బ్రేక్ చేస్తున్నట్టే కనిపిస్తోంది. మహేశ్‌బాబు తప్ప ప్రియాంక చోప్రా, పృధ్వీరాజ్ సుకుమారన్ సమయం వచ్చినప్పుడల్లా మూవీ మాట్లాడుతునే ఉన్నారు. తాజాగా ప్రియాంక చోప్రా మహేశ్‌బాబు సినిమా గురించి ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. 'ప్రస్తుతం హాలీవుడ్ సినిమాలతో తీరిక లేకుండా గడుపుతున్నా. కానీ ఇండియాను, హిందీ సినిమాలను చాలా మిస్ అవుతున్నాను. అప్పుడప్పుడు నా సొంత ఇంటికి దూరమయ్యాననే భావన కలుగుతుంటుంది. కానీ ఇప్పుడు ఓ ఇండియన్ ప్రాజెక్ట్ చేస్తున్నాను. ఆ సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను' అంటూ చెప్పుకొచ్చారు. గతంలో పృథ్వీరాజ్ సుకుమారన్ కూడా పలు సందర్భాల్లో ఎస్ఎస్ఎంబీ 29 గురించి మాట్లాడారు. రాజమౌళి సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. దాని గురించి ఇప్పుడేం మాట్లాడలేనని అన్నారు. కానీ తాను ఈ సినిమాలో ఏడాది క్రితమే భాగమయ్యాను. అప్పటినుంచి ఈ ప్రాజెక్ట్ కోసం వర్క్ చేస్తున్నానని తెలిపారు. కానీ మహేశ్ బాబు మాత్రం జక్కన్న గీసిన గీత దాటడం లేదు. ఎస్ఎస్ఎంబీ 29 గురించి బాబు మాట్లాడిన సందర్భాలు లేవు. లుక్ విషయంలోను లీక్ కాకుండా చాలా జాగ్రత్తగా వ్యవహరించాడు. విదేశాల్లో -ట్రైనింగ్‌కు వెళ్లినా కూడా ఎలాంటి లీకేజీ బయటికి రానివ్వలేదు.





Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.